
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

అన్నమయ్య
జిల్లా వార్తలు
5
గురువారం 24 జూలై 2025

ప్రమాదపుటంచున..



మహిళలు చిన్నారులతో
లారీపై వత్తలూరు పొలాల వైపు వెళుతున్న కూలీలు

- లారీల క్యాబిన్‌లపై ప్రయాణం
- ఇటీవల మామిడికాయల లారీ బోల్తా
- అమాయకులైన 9 మంది కూలీల దుర్మరణం
- అయినా అదేవిధంగా లారీల్లో ప్రయాణం

రాజంపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అసలే ఓవర్‌లోడ్.. మళ్లీ దానిపై మనుషులు ఎక్కి కూర్చోవడం.. ఇలా మామిడి, అరటి, బొప్పాయి కాయలను తోటల్లో నుంచి మండీలకు తరలిస్తూ జరుగుతున్న ప్రమాదాల్లో అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల మామిడికాయల లారీపై ఎక్కి డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల పుల్లంపేటలోని రెడ్డిపల్లె చెరువుకట్టపై లారీ బోల్తా పడిన దుర్ఘటనలో 9 మంది కూలీలు అక్కడికక్కడే చనిపోయి మరో 9 మందికి తీవ్ర గాయాలైన దుర్ఘటన నేటికీ అందరినీ కలచివేస్తోంది. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా లారీలపై మనుషులను ఎక్కించుకోరాదని, ఈ విధంగా జరిగితే అమాయకులు ప్రాణాలు కోల్పోతారని జిల్లా అధికార యంత్రాంగం హెచ్చరించింది. ఈ సంఘటన జరిగి పది రోజులు కాకముందే ఇదే పరిస్థితుల్లో లారీలపై కూలీలను అందునా మహిళలను, చంటిబిడ్డల తల్లులను ఎక్కించుకుని వెళుతున్నారు. ప్రస్తుతం మామిడికాయల సీజన్ ముగిసి అరటికాయల సీజన్ ప్రారంభమైంది. లారీలు అరటికాయల వైపు మళ్లాయి. రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో 30 వేల ఎకరాల్లో అరటి పంట సాగైంది. మరో 30 వేల ఎకరాల్లో బొప్పాయి పంట చేతికి వచ్చింది. ఈ సమయంలో కోడూరు, రాజంపేట నియోజకవర్గాల్లోని చిట్వేలి, ఓబులవారిపల్లె, కోడూరు, పెనగలూరు, పుల్లంపేట, నందలూరు, రాజంపేట, సిద్దవటం, పెనగలూరు మండలాల పరిధిలోని అన్ని గ్రామాలకు తెల్లవారుజామున 6 గంటలకే లారీలను తోటల వైపు మళ్లిస్తున్నారు. కాయలను కోసి పట్టణ ప్రాంతాలకు తరలించడానికి ప్రతిరోజూ 300 పైబడి లారీలు వెళుతున్నాయి. ఈ లారీలన్నీ ఆయా ప్రాంతాల్లోని పండ్ల తోటలకు వెళ్లి కూలీల ద్వారా కాయలను కోసి లారీల్లో వాటిని తరలిస్తున్నారు. ఈ సమయంలో కాయలు కోయడానికి, కోసిన కాయలను లారీల్లో లోడు చేయడానికి కనీసం 3వేల మంది కూలీలు నిత్యం వెళుతున్నారు. వీరందరినీ లారీల యజమానులు తమ లారీల క్యాబిన్‌లపై, లోడు చేసిన లారీలపైనే ఎక్కించుకుని వారి పనులు వారు చేసుకుంటున్నారు. పోలీసు యంత్రాంగం ఈ లారీలపై నిఘా ఉంచి అమాయకులను లారీలపై ఎక్కి ప్రయాణం చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. రైతులు, కూలీలు వీటిపై జాగ్రత్తలు తీసుకోకపోతే మరింత తీవ్రంగా నష్టం జరిగే అవకాశం ఉంది.




ఈనెల 13న పుల్లంపేట వద్ద బోల్తా పడిన మామిడి కాయల లారీ.. ప్రమాదంలో మృతి చెందిన కూలీలు

కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయాలి

- డీపీవో రాధమ్మ



మదనపల్లె టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వ్యాధులను నియంత్రించడానికి ప్రతి మండల కేంద్రంలో ఒక కంట్రోల్ రూం ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ తెలిపారు. బుధవారం మదనపల్లెకు వచ్చిన ఆమె విలేకరులతో మాట్లాడుతూ కంట్రోల్ రూం నుంచి జిల్లా కేంద్రానికి నిత్యం అనుసంధానమై ఉంటుందని, ఏ గ్రామంలో వ్యాధులు ప్రబలుతున్నాయో గమనించి, ముందస్తు చర్యలు తీసుకునేలా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. గ్రామాల్లో తాగునీటి పథకాల వద్ద నిత్యం క్లోరినేషన్ చేయిస్తున్నామని, 15 రోజులకు ఒకసారి ఓవర్‌హెడ్ ట్యాంకులు శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచనలిచ్చామన్నారు. గ్రామాల్లో, మేజర్ పంచాయతీల్లో మురుగునీటి కాల్వల్లో పూడికతీత, చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. గృహాల నుంచి తడి, పొడి చెత్త సేకరణ, డంపింగ్‌యార్డుకు తరలించడం ఒక పద్ధతి ప్రకారం చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కలెక్టర్ ఆదేశాలతో 439 వర్మీ కంపోస్టు యార్డులు నిర్వహిస్తున్నామని, చెత్త సంపద కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. గ్రామాల్లో వీధి దీపాల నిర్వహణ, సమస్యలు ఉంటే అక్కడ అప్పటికప్పుడు పరిష్కారం చూపించేలా పంచాయతీ కార్యదర్శులు, ఈవోఆర్డీలను సమన్వయం చేసుకుంటున్నామని డీపీవో తెలిపారు.

పామిడి నుంచి తిరుమలకు పాదయాత్ర


తిరుమలకు పాదయాత్రగా వెళుతున్న పామిడి వాసులు

ములకలచెరువు, జూలై 23(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా పామిడి నుంచి తిరుమలకు వందమంది భక్తులు పాదయాత్రగా వెళుతున్నారు. ఈనెల 17వ తేదీ పామిడిలో బయలుదేరి బుధవారం ఉదయం ములకలచెరువు చేరుకున్నారు. దీంతో వీరికి ములకలచెరువుకు చెందిన కేజీఎన్ టమోటా మండీల యజమాని కట్టా గోవిందునాయుడు, డాక్టర్ సుభాష్‌చంద్రబోస్, మెడికల్ స్టోర్ రమణ స్వాగతం పలికి మధ్యాహ్నం వరకు వసతి ఏర్పాట్లు చేసి పాలు, పండ్లు అందజేశారు. 29వ తేదీ తిరుమల చేరుకుని స్వామి వారిని దర్శించుకుని మొక్కు తీర్చుకోనున్నామన్నారు. ఇప్పటి వరకు ఐదుసార్లు తిరుమలకు పాదయాత్రగా వెళ్లామని ఇప్పుడు ఆరోసారి వెళుతున్నామని మున్నా, మురళిసుందర్, వేణు, జగదీష్, దీపక్‌రావు, గోపికుమార్ తదితరులు తెలియజేశారు. పామిడి నుంచి తిరుమలకు 340 కిలోమీటర్ల దూరం ఉంటుందని చెప్పారు.

పెన్నానదికి భారీగా వరద నీరు

సిద్దవటం, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు పెన్నానది పరవళ్లు తొక్కుతోంది. దీంతో నదిలో ఎవరూ దిగకుండా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ సందర్భంగా ఎస్ఐ మహమ్మద్‌రఫి మాట్లాడుతూ పెన్నానదికి రెండు రోజులుగా వరదనీరు భారీగా చేరుతోందని, పెన్నానది ప్రాంతాల్లో చేపలు పట్టే జాలర్లు ఎవరూ వేటకు వెళ్లవద్దని, నదిలోకి ఎవరూ దిగవద్దని హెచ్చరికలు జారీ చేశారు. జ్యోతి, ఆకులవీధి, వంతాటిపల్లె, గొల్లపల్లె తదితర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దవటం కాజ్‌వే వంతెన వద్ద ఇద్దరు పోలీసులను బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు.


సిద్దవటం పెన్నానదికి భారీగా వరద నీరు

అంతరిక్ష పరిజ్ఞానం పెంపొందించుకోండి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్


విద్యార్థులతో కలిసి డ్రోన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాజంపేట టౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు అంతరిక్ష పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైన్సు సిటీ ముస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతరిక్ష విద్య అవగాహన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్‌తో పాటు రాష్ట్ర సైన్సు సిటీ సీఈవో కేసినేని వెంకటేశ్వర్లునాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంతరిక్ష విద్యా శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని భవిష్యత్ శాస్త్రవేత్తలుగా మారాలన్నారు. అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకుని ప్రతి విద్యార్థి పట్టుదలతో తమ కలలను సాకారం చేసుకోవాలన్నారు. రాష్ట్ర స్థాయి సైన్స్ సిటీ సీఈవో కేసినేని వెంకటేశ్వర్లునాయుడు మాట్లాడుతూ సైన్సు సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అంతరిక్ష అవగాహన శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరాల్లో పాఠశాల విద్యార్థులకు టెలిస్కోపు, రోబోటిక్, వర్చువల్ రియాలిటీ డ్రోన్‌లు ఆధునిక సాంకేతిక అంశాలపై ప్రాథమిక అవగాహన కల్పించడమే కాకుండా ఈ సాంకేతికలు ప్రస్తుత కాలంలో ఎలా ఉపయోగపడుతున్నాయో వివరిస్తూ ప్రాక్టికల్స్ డెమోస్ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు పీర్‌మున్నీ, డీఈవో సుబ్రహ్మణ్యం, ఎంఈవో రఘునాథరాజు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, ఎంపీడీవో వరప్రసాద్, ముస్కాన్ అధికారి ప్రణీష్, దేబ్‌నాథ్, జిల్లా సైన్సు అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, సెక్టోరియల్ అధికారి జనార్దన్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, ఆఫ్ కాస్ట్ జిల్లా కో-ఆర్డినేటర్ రవిశంకర్‌రెడ్డి, సైన్సు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి మొదటి ప్రాధాన్యం

- ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ప్రసన్నకుమార్



సుండుపల్లె, జూలై 23(ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తోందని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వీవీ ప్రసన్నకుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పాడైపోయిన వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. వెంటనే మరమ్మతులు చేపడతామన్నారు. మండల వ్యాప్తంగా తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తామన్నారు. సుండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తాగునీటి సమస్య ఉందని, అక్కడ ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే చిన్నగొల్లపల్లె గ్రామ పంచాయతీలో తాగునీటి సమస్యను పరిశీలించినట్లు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రూ.35 లక్షలు పాత డీఎంఎఫ్ గ్రాంట్‌ను సమస్య ఉన్న పల్లెల్లో వినియోగిస్తామన్నారు. అలాగే మరికొన్ని గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్యను టీడీపీ, బీజేపీ నాయకులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వాటిలో ప్రధాన సమస్య ఉన్న చోట్ల నీటి వసతిని ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విజయ్‌కుమార్, ఏఈ ఇర్ఫాన్, రాయవరం సర్పంచ్ షరీఫ్, టీడీపీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరాంనాయుడు, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామాజగదీశ్, మాజీ ఎంపీటీసీ మోహన్‌బాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు.


కేజీబీవీలో వాటర్‌ప్లాంట్‌ను తనిఖీ చేస్తున్న ఎస్ఈ ప్రసన్నకుమార్

హెల్మెట్ బరువు కాదు.. బాధ్యత

- 16 నూతన వాహనాలతో ఎస్పీ ఆధ్వర్యంలో ర్యాలీ


హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనంలో వెళుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ప్రజలకు సూచించారు. ట్రాఫిక్ విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది కోసం మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా రూపొందించబడిన ద్విచక్రవాహనాలు, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా డీజీపీ హరీశ్‌కుమార్‌గుప్తా ఆదేశాల మేరకు 16 వాహనాలను అన్నమయ్య జిల్లాకు కేటాయించారు. వాటిని బుధవారం స్థానిక జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం ఆవరణంలో ఎస్పీ ప్రారంభించారు. అనంతరం ప్రజలకు హెల్మెట్ ప్రాధాన్యత గురించి అవగాహన కల్పించే విధంగా ఎస్పీ, అదనపు ఎస్పీలతో పాటు పోలీసు అధికారులు, సిబ్బంది, కళాశాల విద్యార్థులతో కలిసి హెల్మెట్ ధరించి పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి మాసాపేట, రాణా సర్కిల్, బంగ్లా సర్కిల్, శివాలయం సర్కిల్, జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం వరకు ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హెల్మెట్‌ను నిబంధనల కోసం కాకుండా ప్రాణ రక్షణ కోసం ధరించాలన్నారు. మూడు, నాలుగేళ్లు ఉండే మొబైల్ ఫోన్ కింద పడకుండా జాగ్రత్తలు తీసుకుంటామని, ఒకవేళ కింద పడ్డా పగిలిపోకుండా ఖరీదైన స్క్రీన్ గార్డు వేయిస్తామని, మరి ఎంతో విలువైన జీవితం మాటేంటన్నారు. తల పగిలితే జీవితాన్ని కోల్పోతామని, మనపై ఆధారపడ్డ వాళ్లను రోడ్డున పడేసినట్లేనని అందుకే హెల్మెట్ లేకుండా ప్రయాణం ప్రాణాంతకమన్నారు. 16 వాహనాలకు పోలీసు సైరన్, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్, ప్రథమ చికిత్స కిట్‌లతో పాటు ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానాన్ని జత చేయడం జరిగిందన్నారు. జిల్లాలో రాజంపేట, రాయచోటి, మదనపల్లి సబ్ డివిజన్ల పరిధిలో ముఖ్యమైన ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను క్లియర్ చేయడానికి, పెట్రోలింగ్ నిర్వహించేందుకు, మహిళల భద్రతకు ఈ ద్విచక్రవాహనాలను వినియోగిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి, రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామనాథ్‌హెగ్డే, మదనపల్లి డీఎస్పీ ఎస్.మహేంద్ర, రాయచోటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్, ఏఆర్ డీఎస్పీ ఎం.శ్రీనివాసులు, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అన్యమత ప్రస్తావన రాజ్యాంగ విరుద్ధం

- కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్


మీడియాతో మాట్లాడుతున్న చింతా మోహన్

మదనపల్లె, జూలై 23 (ఆంధ్రజ్యోతి): టీటీడీలో అన్యమతాన్ని గురించి ఒక సివిల్ సర్వెంట్ మాట్లాడటం బాధాకరమే కాదు.. రాజ్యాంగ విరుద్ధమని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చింతా మోహన్ తెలిపారు. మదనపల్లెలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అన్యమతం గురించి మాట్లాడటం సబబు కాదని సూచించారు. రాజకీయాల్లో, ప్రజా జీవితంలో చాలా జాగ్రత్తగా ఉండాలని ఇందుకు ఉదాహరణే ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి లిక్కర్ స్కాంలో అరెస్టుగా పేర్కొన్నారు. మదనపల్లె ఫైల్స్ కేసుకు ఏడాదైనా ఇప్పటి వరకు పురోగతి లేదని, వెంటనే విచారణ పూర్తి చేసి నిందితులెవరో తేల్చాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఏపీలో నాటి కాంగ్రెస్ పాలనలో ప్రవేశ పెట్టిన 35 వేల స్కూల్స్ మాత్రమే ఉన్నాయని, కూటమి ప్రభుత్వంలో కొందరికే విద్య అందుతోందని తెలిపారు. చెన్నైలో వెయ్యి ఎకరాలు, బెంగళూరు, భువనేశ్వర్, హైదరాబాద్‌లలో వెయ్యి ఎకరాల చొప్పున రాజధాని నిర్మిస్తే, అమరావతికి 35 వేల ఎకరాలు ఎందుకని ప్రశ్నించారు. రాజధాని పేరుతో అమరావతిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ, భూములు అమ్ముకుంటున్నారని ఆయన ఆరోపించారు. సమావేశంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ రెడ్డిసాహెబ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి పెట్టండి : కలెక్టర్

రాయచోటి (కలెక్టరేట్), జూలై 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కార్యక్రమంలో ఎంపిక చేసిన 10 గ్రామాల్లో అభివృద్ధి పనులపై వెంటనే చర్యలు చేపట్టాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా సాంఘీక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కార్యక్రమంపై వివిధ శాఖల జిల్లా అధికారులు ఎంపీడీవోలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కార్యక్రమంలో 10 గ్రామాలు ఎంపికయ్యాయని, ఇందులో 8 గ్రామాలకు సంబంధించిన విలేజ్ డెవలప్‌మెంటల్ ప్లాన్లను ఇంకా సమర్పించలేదని, ఎంపీడీవోలు వెంటనే తయారు చేసి జడ్పీ సీఈవో ద్వారా అందించాలని ఆదేశించారు. ఎస్సీ జనాభా 50 శాతం కంటే ఎక్కువగా ఉన్న ఈ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు ఇతర సౌకర్యాల ఏర్పాటు కోసం ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చినట్లు తెలిపారు. సమావేశంలో సాంఘీక సంక్షేమశాఖ అధికారి కృష్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

పాతాళానికి భూగర్భ జలాలు

- ఇంకిపోతున్న తాగు, సాగునీటి బోర్లు
- పంటలకు ట్యాంకర్ల నీరే గతి


మర్రిపాడులో ఇంకిపోయిన తాగునీటి బోరు

గుర్రంకొండ, జూలై 23(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ప్రారంభమై నెలలు గడుస్తున్నా వర్షాలు కురవకపోవడంతో కుంటలు, చెరువుల్లోకి చుక్కనీరు చేరలేదు. కురిసే చిరు జల్లులకు భూమి తడవడం తప్ప భూగర్భజలాలు పెరగడం లేదు. ఈ ఏడాది కూడా కుంటలు, చెరువులు నిండకపోతే రైతుల పరిస్థితి దారుణంగా ఉంటుంది. వానలు కురవక చెరువులు నిండకపోతే బతుకుదెరువు కోసం ఎక్కడికి వెళ్లాలో తెలియక ఉన్న అప్పులు తీర్చడం ఎలా అంటూ దిక్కుతోచని పరిస్థితిలో రైతన్న ఉన్నాడు. గుర్రంకొండ మండలంలో 15 పంచాయతీలున్నాయి. ఈ పంచాయతీల్లో 175 గ్రామాలుండగా సుమారుగా 129 కుంటలు, చెరువులు ఉన్నాయి. మండలంలో నేటికీ చాలా గ్రామాల్లో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి కోసం రాత్రింబవళ్లు ఎదురుచూస్తున్నారు. చిరుజల్లులు కురుస్తున్నా ఒక్క చెరువులోకి కూడా చుక్కనీరు చేరలేదు. ఈ చిరుజల్లులకు పొలాలు పచ్చదనం సంతరించుకున్నాయే తప్ప భూగర్భ జలాలు మాత్రం పెరగలేదు. ఇప్పటికే కుంటలు, చెరువులు నిండి మూడు సంవత్సరాలు గడుస్తోంది. చివరగా 2021 నవంబరు నెలలో తుఫాన్‌తో కుంటలు, చెరువులు నిండి మొరవ పారాయి. అప్పటి నుంచి నేటి వరకు వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో భూగర్భజలాలు పాతాళానికి పడిపోయాయి. దీంతో గ్రామాల్లో వ్యవసాయం సాగక, తాగడానికి నీరు లేక పల్లె ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. మండలంలోని మర్రిపాడు, టి.పసలవాండ్లపల్లె, నడిమిఖండ్రిగ, మొటుకు గ్రామాల్లో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామాల్లో తాగునీటి బోర్లలో అరకొరగా నీరు వస్తుండడంతో ప్రజలు తాగునీటి కోసం పడరానిపాట్లు పడుతున్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అడుగంటుతున్న బోర్లు

వర్షాలు సరిగ్గా కురవకపోవడంతో గ్రామాల్లో సాగునీటి బోర్లు రోజు రోజుకు అడుగంటుతున్నాయి. భూగర్భ జలాలు పాతాళానికి పడిపోవడంతో చాలా బోర్లు ఇంకిపోతున్నాయి. ఇందులో భాగంగా 300 అడుగుల లోతు నుంచి 900 అడుగుల లోతు ఉన్న బోర్లు సైతం ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బోర్లను నమ్ముకుని పంటలు సాగు చేస్తున్న రైతులు బోర్లు ఉన్నఫలాన నిలిచిపోతుండడంతో పంటను కాపాడుకోవడం కోసం భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని బోర్లలో నీరు పుష్కలంగా పడుతున్నాయి. మరికొన్ని బోర్లలో నీరు పడకపోవడంతో రైతులు అప్పులను మూటగట్టుకుంటున్నారు. తలారివాండ్లపల్లెలో ఓ రైతు నెల రోజుల క్రితం రూ.6 లక్షలకు పైగా ఖర్చు చేసి 900 అడుగులకు పైగా బోరు వేశాడు. నెల రోజులు బాగా వచ్చిన నీరు ఉన్నట్లుండి పూర్తిగా రాకుండా ఆగిపోయాయి. ఈ బోరును నమ్ముకుని వేసిన టమోటా పంట ఎండిపోతుండటంతో ట్యాంకర్ల ద్వారా నీటిని పడుతూ పంటను కాపాడుకుంటున్నాడు.


తలారివాండ్లపల్లె వద్ద
టమోటా పంటకు
ట్యాంకర్‌తో నీళ్లు పడుతున్న రైతు

చెత్త సంపద కేంద్రం తనిఖీ చేసిన కలెక్టర్



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ శ్రీధర్

రాజంపేటటౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల పరిధిలోని హస్తవరం గ్రామ పంచాయతీలోని చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీలోని పారిశుధ్య కార్మికులు ప్రతిరోజూ ఇంటింటికి వెళ్లి ఎంత చెత్త సేకరిస్తున్నారు. ఆ చెత్తను కేంద్రానికి తీసుకువచ్చి వేరు చేస్తున్నారా లేదా అని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. రాజంపేట మండలంలో హస్తవరం గ్రామ పంచాయతీకి ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా నిర్వహించిన సర్వేలో 40 శాతం మాత్రమే పాజిటివ్ వచ్చిందన్నారు. వెనుకబడి ఉండడానికి గల కారణాలు తెలుసుకుని వాటిని సరిదిద్ది వంద శాతానికి చేరుకోవాలన్నారు. అనంతరం హస్తవరం ఉన్నత పాఠశాలను సందర్శించి అక్కడ నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం ఎలా అమలవుతుంది, ప్రతిరోజూ మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందిస్తున్నారా, రుచికరంగా ఉందా అనే విషయాలపై కలెక్టర్ ఆరా తీశారు. విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం అందించాలని, వంట ఏజెన్సీ వారికి, ఉపాధ్యాయులకు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో వరప్రసాద్, రాజంపేట తహసీల్దారు పీర్‌మున్నీ, పంచాయతీ విస్తరణాధికారి రామ్మూర్తి, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి అభినందనలు

పుల్లంపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): చెత్త సేకరణలో పురోగతి సాధించి వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాన్ని పురోగతిలో పెట్టిన తిప్పాయపల్లె పంచాయతీ కార్యదర్శి గంగాధర్‌ను కలెక్టర్ చామకూరి శ్రీధర్ అభినందించారు. తిప్పాయపల్లె ఎస్‌డబ్ల్యూపీసీ (చెత్త సేకరణ కేంద్రాన్ని) కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెత్త సేకరణ కేంద్రం వినియోగం గ్రీన్ అంబాసిడర్ల నిర్వహణపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రీన్ అంబాసిడర్లతో సమస్యలు తెలుసుకున్నారు. గతంలో కంటే మెరుగైన జీతాలు సకాలంలో అందుతున్నాయని కలెక్టర్‌కు గ్రీన్ అంబాసిడర్లు తెలిపారు. గతనెల 5న తిప్పాయపల్లెలో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రం సందర్శించినప్పటికి, నేటికి ఎంతో మార్పు కనిపించడంతో తక్కువ సమయంలో అతి తక్కువ మంది గ్రీన్ అంబాసిడర్లను వినియోగించుకుని పురోగతి సాధించడంపై పంచాయతి కార్యదర్శి గంగాధర్‌ను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు పుల్లారెడ్డి, ఎంపీడీవో జయశ్రీ, ఈవోపీఆర్డీ ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిలువు దోపిడీ

- కనీస విద్యార్హత లేకుండానే రోగులకు వైద్యం
- ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృత్ తేజ



సమావేశంలో మాట్లాడుతున్న అమృత్ తేజ

పీలేరురూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోగులను నిలువు దోపిడీ చేస్తున్నారని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృత్ తేజ ఆరోపించారు. బుధవారం ఆయన పీలేరులో విలేకరులతో మాట్లాడుతూ మంత్రితో పాటు వైద్యశాఖ అధికారులు ప్రైవేట్ ఆస్పత్రుల ఆగడాలపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. కనీస విద్యార్హత లేని వారిచే రోగులకు వైద్యం చేయిస్తూ ప్రణాలతో చెలగాటం ఆడుతున్న ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నామమాత్రంగా తనిఖీ చేపడుతున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముందస్తుగా ఎటువంటి పరీక్షలు నిర్వహించకుండా ధనార్జనే ధ్యేయంగా ఆపరేషన్లు చేసి రోగుల ప్రాణాలు తీస్తున్నారని ఆరోపించారు. రోజురోజుకూ ప్రైవేట్ ఆస్పత్రుల ఆగడాలు మితి మించిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యం వికటించి ప్రాణాలు పోతే డబ్బు ఎరచూపి తప్పించుకుంటున్నారని ఆరోపించారు. పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యం అందించేకన్నా వ్యాపార దృక్పథంతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు ప్రైవేట్ మెడికల్ మాఫియాపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో విద్యార్థి సంఘ నేతలు తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

దువ్వూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం క్రీస్తురాజపురం వద్ద టిప్పర్ ఢీకొని గాయపడ్డ మద్దూరు హుస్సేనయ్య (63) అనే వ్యక్తి బుధవారం తెల్లవారుజామున మృతిచెందినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. ప్రమాద సంఘటన ఈ నెల 12న జరిగింది. రాజుపాళెం మండలం వెలువలి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై మైదుకూరు సంతకు మేకపిల్లను తీసుకుని వెళుతుండగా ప్రమాదం జరిగింది. అదే రోజు ఒకరు మృతిచెందారు. గాయపడ్డ హుస్సేనయ్య కడప అటు నుంచి తిరుపతికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.

శ్రీరామ ఎత్తిపోతల పథకానికి..

పూర్వ వైభవం వచ్చేనా ..?

- టీటీడీ స్వాధీనం ఎప్పుడో ?
- రైతుల ఆశలు చిగురించేనా !



నీరులేక ఎండిపోయిన ఒంటిమిట్ట చెరువు

ఒంటిమిట్ట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలోని అతి పెద్ద చెరువుల్లో ఒంటిమిట్ట చెరువు ఒకటి. ఈ చెరువు నిండితే మండలంలోని అన్ని గ్రామాలు సస్యశ్యామలంగా ఉంటాయి. చెరువు నిండాలని మండల రైతులు మొక్కని దేవుడు అంటూ ఉండరు. ఒక్కసారి చెరువు నిండితే మూడు సంవత్సరాలు రైతులు సంతోషంగా పంటలు పండిస్తారు. వర్షం పడితేగాని ఒంటిమిట్ట చెరువుకు నీరు రాదు. వర్షాలు పడక చెరువుకు నీరు రాకపోవడంతో మండల రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. తాగునీరుకు కూడా ప్రజలు అవస్థలు పడేవారు అలాంటిది 2014లో రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రం విడిపోయి భద్రాచలం తెలంగాణలో ఉండిపోవడంతో, ఒంటిమిట్ట కోదండరాముని ఆలయానికి రాష్ట్ర గుర్తింపు ఇచ్చి ఉత్సవాలను ప్రభుత్వం తరపున నిర్వహించాలని సీఎం నిర్ణయించారు. అలాగే ఒంటిమిట్ట చెరువుకు సోమశిల బ్యాక్‌వాటర్ నుంచి సాగునీరు అందించాలని సీఎం రూ.32 కోట్లను విడుదల చేశారు. ఈ పనులకు సంబంధించి 2015లో చంద్రబాబు శంకుస్థాపనలు కూడా చేశారు. సంవత్సరం తిరగకముందే ఒంటిమిట్ట చెరువుకు సోమశిల బ్యాక్ వాటర్ శ్రీరామ ఎత్తిపోతల పథకం నుంచి సాగునీరు చేరాయి. దీంతో మండల ప్రజల ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. 2019 తరువాత ఈ స్కీంకు మెయింటినెన్స్ నిధులు అప్పటి ప్రభుత్వం మంజూరు చేయక పోవడంతో నీరు అందక చెరువు ఎండిపోయింది. గత ప్రభుత్వం ఐదు సంవత్సరాల్లో ఒక్కరూపాయి కూడా నిధులు మంజూరు చేయకపోవడంతో తిరిగి మండలంలో కరవుఛాయలు అలుముకున్నాయి. దీంతో రైతులు పంటలు సాగు లేక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

2024లో తిరిగి రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించడంతో మండల రైతులు సంతోషం వ్యక్తం చేశారు. చంద్రబాబునాయుడు పాలనలో ఎత్తిపోతల పథకానికి నిధులు మంజూరు చేసి చెరువుకు సాగునీరు అందిస్తారని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పలుసార్లు శ్రీరామ ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేసి సాగునీరును నింపేందుకు ప్రయత్నించగా పైపులు పగిలిపోవడంతో పలుసార్లు అంతరాయం ఏర్పడింది. దీంతో ఇరిగేషన్ అధికారులు పరిశీలించి పాత పైపులైను పూర్తిగా దెబ్బతిన్నదని, కొత్త పైపులైను వేయాలని ప్రభుత్వానికి రూ.12 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన కోదండరాముని కల్యాణోత్సవానికి సీఎం చంద్రబాబు విచ్చేశారు. కల్యాణం అనంతరం టీటీడీ ఛైర్మన్ జిల్లా కలెక్టర్, టీటీడీ ఈవో, అదనపు జేఈవోలతో కోదండరామాలయ అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి పలు సూచనలు ఇచ్చారు. అలాగే శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని టీటీడీ స్వాధీనం చేసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. టీటీడీ అధికారులు చెరువు అంతర్గత విస్తీర్ణం ఆయకట్టు ప్లాను, ఎత్తిపోతల పథకం పనితీరు, మోటార్లు, పైపులైను సమాచారాన్ని సేకరించాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు చెరువు అంతర్గత విస్తీర్ణం మాత్రమే సేకరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించి నెలలు గడుస్తున్నా టీటీడీ అధికారులు మాత్రం పట్టించుకున్న పాపాన పోలేదని పలువురు రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా టీటీడీ అధికారులు శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని స్వాధీనం చేసుకుని కొత్త పైపులైను అమర్చి చెరువుకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



సాగునీరు అందించే పైపులైను

చెరువుకు సాగునీరు అందించాలి



జిల్లాలోనే అతిపెద్ద చెరువు అయిన ఒంటిమిట్ట చెరువుకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలి. గత రెండేళ్లుగా వర్షాలు లేకపోవడంతో భూగర్భజలాలు అడుగంటాయి. అధికారులు స్పందించి చెరువుకు సాగునీరు అందించాలి.

- వెంకటసుబ్బారెడ్డి, మండల టీడీపీ రైతు సంఘం అధ్యక్షుడు, ఒంటిమిట

టీటీడీ స్వాధీనం చేసుకోవాలి



టీటీడీ వారు ఒంటిమిట్ట శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని స్వాధీనం చేసుకోవాలి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకొని మరమ్మతు పనులు చేసి చెరువుకు త్వరగా సాగునీరు అందించాలి.

- మాడ రామాంజనేయులు, రైతు, ఒంటిమిట్ట

బాలల హక్కులు, చట్టాలపై అవగాహన పొందాలి

- ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి



బాలల హక్కులు, చట్టాలపై మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి

మదనపల్లెటౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న బాలల హక్కులు, చట్టాలపై ప్రతి ప్రభుత్వ ఉద్యోగి అవగాహన కలిగి వుండాలని ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి పేర్కొన్నారు. బుధవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఎంఈఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఎస్ఐలు, చైల్డ్ వెల్ఫేర్ అధికారులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు వర్క్‌షాప్ నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ నేటి సమాజంలో అనాథ పిల్లలు, దివ్యాంగులైన పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని వారి కుటుంబ పెద్దలు భిక్షాటనలో దింపుతున్నారన్నారు. మరి కొందరు బాలికలను బాల్యవివాహాలు చేసి వారి భవిష్యత్‌ను నాశనం చేస్తున్నారన్నారు. వీటన్నింటినీ నిషేధించేందుకు ప్రభుత్వాలు చట్టాలు తీసుకొచ్చాయన్నారు. అందులో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం, జువైనల్ జస్టిస్ యాక్ట్, పోక్సో చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టం అమలులో వున్నాయన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో చదువుకున్న వారికి ఈ చట్టాలపై అవగాహన వస్తోందని, బాల, బాలికలు ఉన్నత చదువులు చదుకోవడానికి తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. గ్రామస్థాయి కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని అందులో పంచాయతీ కార్యదర్శి అధ్యక్షులుగా వుండాలన్నారు. ప్రతి నెలా మొదటి, మూడో శుక్రవారం సమావేశాలు నిర్వహించి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి వినోద్ కుమార్ మాట్లాడుతూ ఈ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో ప్రతి ప్రభుత్వ ఉద్యోగి బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె, బి.కొత్తకోట, వాల్మీకిపురం, మదనపల్లె, ఐసీడీఎస్ సీడీపీఓలు సుజాత, భాగ్యమ్మ, పోర్డు సంస్థ డైరెక్టర్ లలితమ్మ, సూపర్‌వైజర్లు శ్వేత, రమాదేవి, మహిళా ఎస్ఐలు, ఎంఈవోలు, పాల్గొన్నారు.

నైపుణ్యాలను వెలికి తీయడమే ఉపాధ్యాయుల కర్తవ్యం

- డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు



ఇంగ్లీష్ క్లబ్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు

రాయచోటిటౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): నైపుణ్యాలను వెలికి తీయడమే ఉపాధ్యాయుల కర్తవ్యమని డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు తెలిపారు. బుధవారం రాయచోటి పట్టణంలోని డైట్‌లో ఇంగ్లీష్ క్లబ్ ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమం విద్యార్థుల భాషా నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు, ఇంగ్లీష్ సాహిత్యం, కమ్యూనికేషన్, సాంస్కృతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసేందుకు ఒక ముఖ్యమైన వేదికగా నిలవనుందని డైట్ ఇంగ్లీష్ లెక్చరర్ తిరుపతి శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు ఇంగ్లీష్ భాషా ప్రాముఖ్యతను వివరించారు. ఇది ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనికేషన్ కోసం అత్యంత అవసరమైన భాష అని పేర్కొంటూ విద్యార్థులు ఈ క్లబ్ ద్వారా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ విద్యావేత్త, సాంస్కృతిక విద్య జిల్లా సమన్వయకర్త కొండూరు శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఇంగ్లీష్ క్లబ్ ద్వారా విద్యార్థులకు డిబేట్లు, చర్చలు, కవితా పఠనలు, ప్రదర్శనలు, వర్క్‌షాపులు వంటి కార్యక్రమాలు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డైట్ లెక్చరర్స్ వెంకటసుబ్బారెడ్డి, శివభాస్కర్, వైసీ రెడ్డెప్పరెడ్డి, మోహన్‌నాయక్, శివప్రసాద్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

షోలాపూర్ - తిరుపతి ప్రత్యేక రైలు ధర్మవరం వరకు పొడిగింపు

కడపఎర్రముక్కపల్లె, జూలై 23 (ఆంధ్రజ్యోతి): షోలాపూర్-తిరుపతిల (01437/01438) మధ్య కడప మీదుగా వెళ్లే ప్రత్యేక రైలును ధర్మవరం వరకు రెండు నెలల పటు పొడిగించినట్లు కడపరైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. ఈనెల 24 నుంచి సెప్టెంబర్ 27వ తేదీ వరకు రాను 10 ట్రిప్పులు, పోను 10 ట్రిప్పులు నడుస్తుందన్నారు. షోలాపూర్ నుంచి తిరుపతి (01437 రైలు) ప్రతి బుధవారం రాత్రి 11:20 గంటలకు షోలాపూర్‌లో రైలు బయలుదేరి రాయచూర్, మంత్రాలయం, గుంతకల్ మీదుగా ఎర్రగుంట్లకు శుక్రవారం రాత్రి 7:18 గంటలకు, కడపకు 7:53గంటలకు చేరుకోనుందన్నారు. ధర్మవరానికి శనివారం ఉదయం 3:30గంటలకు చేరుకుంటుందన్నారు. ఈ రైలు తిరుగు ప్రయాణంలో ప్రతి శనివారం ఉదయం 5:30గంటలకు ధర్మవరంలో బయలుదేరి రేణిగుంట మీదుగా తిరుపతికి 11:00 గంటలకు, రాజంపేటకు మధ్యాహ్నం 12:28కి, కడపకు 1:28కి, ఎర్రగుంట్లకు 2.09కి చేరుకుంటుందన్నారు. తాడిపత్రి, గుంతకల్ మీదుగా ఆదివారం ఉదయ 10:4కి షోలాపూర్‌కు చేరుకుంటుందన్నారు.

భూమి చదునును అడ్డుకున్న అధికారులు




భూమిని చదును చేస్తుండగా అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

మదనపల్లె అర్బన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): అక్రమంగా భూమిని చదును చేస్తుండగా బుధవారం రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. మదనపల్లె మండలం, కొండామరిపల్లె పంచాయతీలో కొందరు అక్రమంగా ఎక్స్‌కవేటర్‌తో భూమిని చదును చేస్తున్నట్లు తహసీల్దార్ కార్యాలయానికి సమాచారం అందడంతో తహసీల్దార్ కిరణ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు అక్కడికి రెవెన్యూ సిబ్బంది చేరుకుని అడ్డుకున్నారు. ప్రభుత్వ భూమిని చదును చేయడం నేరమని, ప్రభుత్వ భూమిని అక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సచివాలయ సర్వేయర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఆవులకు చర్మవ్యాధి నిరోధక టీకాలు

- జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్‌పిళ్లై



ఆవులను పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి

నందలూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతి ఇసుకపల్లె గ్రామంలో ఆవులకు ముద్దచర్మ వ్యాధి నిరోధక టీకాలను వేసినట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జూలై 11 నుంచి 31వ తేది వరకు జరిగే లంపిస్కిన్ (ఆవుల్లో ముద్ద చర్మ)వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆవులకు ముద్ద చర్మ వ్యాధి వచ్చిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాడి రైతులకు వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందలూరు పశువైద్యులు డాక్టర్ పి.ఈశ్వర్‌ప్రసాద్, డాక్టర్ వై.మాధవిలత, వీఏడీ సుదర్శన్‌రెడ్డి, ఏహెచ్‌ఏలు బి.జాహ్నవి, వై.శిరీషా, బి.శివరాం, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

రాయచోటిటౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని అనారోగ్య బాధితుల ఆసుపత్రి ఖర్చులకు గానూ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. బుధవారం నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి మంత్రి మండిపల్లి క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 20 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.25.30 లక్షల చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.



సీఎం సహాయ నిధి చెక్కులను అందజేస్తున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

మట్టి మాఫియా ఇష్టారాజ్యం

- విఠలం, వడ్డిపల్లె చెరువుల్లో అక్రమ తవ్వకాలు
- బొరియలుగా మారిపోయిన చెరువులు.. అధికారుల చోద్యం

వాల్మీకిపురం, జూలై 23(ఆంధ్రజ్యోతి): రేయింబవళ్లు ఎక్స్‌కవేటర్లతో మట్టిని తోడేస్తూ అక్రమంగా తరలిస్తూ విఠలం, వడ్డిపల్లె చెరువులను ఎక్స్‌కవేటర్లతో తోడేస్తున్నారు. జాతీయ రహదారికి పక్కనే ఉన్న చెరువుల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు సాగుతున్నా అధికారులు పట్టించుకోలేదని విమర్శలున్నాయి. చెరువు నుంచి మట్టిని అక్రమంగా తరలించుకు పోతుండడంతో ఎటుచూసినా అగాధాలు, బొరియలుగా మారి చెరువు ప్రాంతం రూపు రేఖలు కోల్పోతోంది.

వాల్మీకిపురం మండలంలోని విఠలం గ్రామ సమీప చెరువులో మట్టి మాఫియా ఇష్టారాజ్యంగా తవ్వకాలు సాగిస్తున్నారు. కొద్ది నెలలుగా చెరువు ప్రాంతంలో ఎక్స్‌కవేటర్లు పెట్టి మట్టిని అక్రమంగా తవ్వేస్తూ రియల్‌ఎస్టేట్ భూములకు తదితర వాటికి ట్రాక్టర్ల ద్వారా తరలించుకుపోతుండడం గమనార్హం. జాతీయ రహదారికి పక్కగానే ఉన్న చెరువు ప్రాంతంలో మట్టి అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మట్టిని అక్రమంగా తరలించుకుపోతుండడంతో చెరువు రూపురేఖలు కోల్పోతోంది. ఇప్పటికైనా అక్రమ మట్టి తవ్వకాలపై అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. మండలంలోని జర్రావారిపల్లె గ్రామ పంచాయతీ చీమలబండ వడ్డి పల్లె ప్రాంతంలోని చెరువులో మట్టి మాఫియా ఆగడా లకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఎటువంటి అనుమతులు లేకుండా రాత్రీ పగలు ఎక్స్‌కవేటర్లతో మట్టిని తోడేస్తూ రియల్‌ఎస్టేట్ వెంచర్లు తదితర వాటికి అక్రమంగా తరలించుకుపోతున్నారు. ఈ ప్రాంతంలో చెరువులకు నీరు వచ్చే మార్గం లేక 20ఏళ్లుగా గడ్డు పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇసుక మాఫియా దౌర్జన్యాలతో మట్టి అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని, అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ పామిలేటిని వివరణ కోరగా మండలంలోని చెరువు ప్రాంతంలో అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇక ముందు నిఘా పెట్టి అక్రమ తవ్వకాలకు పాల్పడే వాహనాలు సీజ్ చేస్తూ తగు చర్యలు తీసుకుంటామన్నారు.



మట్టి తవ్వకాలతో అగాదాలుగా మారిపోయిన వడ్డిపల్లె చెరువు



విఠలం చెరువులో ఎక్స్‌కవేటర్లతో మట్టితవ్వకాలు



చీమలబండ వడ్డిపల్లె చెరువులో ఎక్స్‌కవేటర్లతో మట్టి తవ్వకాలు

అటకెక్కిన శిక్షణ

● నిరుపయోగంగా మారిన శిక్షణ కేంద్రం
● శిథిలమవుతున్న భవనం
● వృథా అవుతున్న ప్రజాధనం

కడప ఎన్జీఆర్ సర్కిల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రం నిరుపయోగంగా మారుతోంది. కడప నగర శివారు ప్రాంతంలో 2008 నవంబరు 1న అప్పటి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గల్లా అరుణకుమారి క్లస్టరు స్థాయి జీవనోపాధుల వనరుల కేంద్రం ప్రారంభించారు. అప్పటి నుంచి డ్వామా పరిధిలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాలు ఇక్కడే నిర్వహించేవారు. రాత్రిపూట శిక్షణార్థులు బస చేసేందుకు వీలుగా డార్మిటరీలను ఏర్పాటు చేశారు. కానీ గత కొంత కాలంగా ఇక్కడ శిక్షణలను ఇవ్వకపోవడంతో భవనం నిరుపయోగంగా మారుతోంది. చాలా వరకు శిక్షణ కార్యక్రమాలను కొత్త కలెక్టరేట్‌లోని డి.బ్లాక్ లోనే నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో డీఎల్ఆర్‌సీ భవనం పూర్తిగా నిరుపయోగంగా మారింది. దీంతో భవ నంలోని పలు గదుల్లో సామగ్రి శిథిలావస్థకు చేరుకుంటోంది. గదులకు ఏర్పాటు చేసిన తలుపులు పాడైపోయాయి. విద్యుత్ సౌక ర్యం కూడా సరిగా లేకపోవడంతో చీకటి అలుముకుంది. కిటికీలు ధ్వంసమవుతున్నాయి. చిన్నపాటి మరమ్మతులు చేపడితే ఈ భవ నం అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి. కానీ పూర్తిగా వదిలి వేయడంతో భవనం శిథిలమయ్యే పరిస్థితి కనిపిస్తుంది.



ఊడిన తలుపులు



డీఎల్ఆర్‌సీ భవనం



నిరుపయోగంగా ఉన్న శిక్షణ గది

సిబ్బంది హాజరు నామమాత్రం

డీఎల్ఆర్‌సీ భవనంలో ఎలాంటి శిక్షణలు ఇవ్వకపోయినప్పటికీ అక్క డ సిబ్బందికి ఏ పని చేయకున్నా వేతనాలు అందిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కేంద్రంలో నలుగురు ట్యూటర్లతో పాటు ఒక కంప్యూటరు ఆపరేటరు, పగటిపూట అటెండరు, రాత్రివేళల్లో వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేశారు. అయితే వీరిలో పగలు అటెండరు, రాత్రివేళల్లో వాచ్‌మెన్ మాత్రమే కేంద్రంలో విధులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ప్రతినెలా వేలాది రూపాయలు వారికి వేతనాలుగా చెల్లిస్తున్నారు. ఇటీవల డీఎల్ఆర్‌సీ భవనాన్ని ఆంధ్రజ్యోతి సందర్శించగా అక్కడ అటెండరు ఒక్కరే ఉన్నారు. మిగతా సిబ్బంది గురించి ఆరా తీస్తే వారందరూ భోజనానికి వెళ్లినట్లు అటెండరు సమాధానం ఇవ్వడం గమనార్హం. ఈ విషయం డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా తాను పరిశీలించి చర్యలు తీసుకుంటానని సమాధానం ఇచ్చారు.

ఆర్డీఓ టేబుల్‌పైకి యూసీఐఎల్ బాధితుల ఫైల్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పులివెందుల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): యూసీఐఎల్ బాధితుల ఫైలు ఎట్టకే లకు ఆర్డీఓ చిన్నయ్య టేబుల్‌పైకి చేరింది. బుధవారం 'ఎన్నేళ్లీ... ఎదు రుచూపులు' ఆర్డీఓ కార్యాలయంలో ఫైలు మాయం అనే శీర్షికతో ఆంధ్ర జ్యోతిలో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన ఆర్డీఓ చిన్నయ్య కార్యాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. 10.30గంటలకు నేను కార్యా లయానికి వచ్చేసరికి ఫైల్ నా టేబుల్‌పై ఉండాలని కిందిస్థాయి అధికా రులకు చెప్పినట్లు తెలిసింది. దీంతో కార్యాలయాలో పనిచేసే అధికారులు ఉదయం నుంచే ఫైలు వెతకడం ప్రారంభించారు. అన్ని సెక్షన్లలోను, ర్యాకుల్లో ఫైళ్లన్నీ పరిశీలించగా.. ఫైల్ కంటపడడంతో అధికారులు ఊపిరిపీల్చు కున్నారు. ఆర్డీఓ కార్యాలయానికి వచ్చేసరికి ఆయన టేబుల్ పైకి ఫైల్ చేరింది. దీంతో కార్యాలయానికి వచ్చే ఫైళ్లను జాగ్రత్తగా భద్రపరచాలని ఆర్డీఓ సిబ్బందికి చెప్పినట్లు తెలిసింది. 11గంటల ప్రాంతంలో ఫైల్‌కు సంబంధించిన బాధితులు భాస్కర్, రవిశంకర్‌లు కార్యాలయానికి వెళ్లగా.. అక్కడున్న సిబ్బంది మీఫైల్ కనిపించిందని అది ఆర్డీఓ టేబుల్‌పైన ఉందని సమాచారం ఇచ్చారు. అదే సమయంలో ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లిన ఆంధ్రజ్యోతికి వారు ఫైల్ విషయాన్ని వివరించారు. మా ఫైల్ కనిపిం చకపోయేటప్పటికి 14ఏళ్లుగా ఎదురు చూసిన ఉపయోగం లేకుండా పోయిం దని ఎంతో బాధపడ్డామని వారు వివరించారు. ఆంధ్రజ్యోతి పుణ్యమా అని వారు మా ఫైల్ కనిపించిందని, కృతజ్ఞతలు తెలిపారు. యూసీఐఎల్ స్పం దించి మాకు ఇవ్వాల్సిన ఉద్యోగాన్ని మాకు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

రైలు కిందపడి గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య



కడప క్రైం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా తాడిపత్రి రైల్వే స్టేషను సమీపంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసుల వివరాల మేరకు.. మృతుడి వయసు 22 నుంచి 26 సంవత్సరాల మధ్యలో ఉంటుందని.. మృతుడి జేబులో చెన్నై టు కడప టికెట్ గుర్తించారు. అయితే చెన్నై నుంచి కడపలో దిగలేక తాడిపత్రిలో దిగి ఆత్మహత్య చేసుకున్నాడా అనే విషయంపై అక్కడ రైల్వేపోలీసులు ఆరా తీస్తున్నారు. మృతి చెందిన యువకుడి ఇతర వివరాల కోసం తాడిపత్రి పోలీసులను సంప్రదించాలని తాడిపత్రి రైల్వే కానిస్టేబుల్ వరప్రసాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



కడప క్రైం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రాజంపేట రోడ్డులోని మహిళా పాలిటెక్నిక్ కళాశాల వద్ద బుధవారం తెల్లవారు జామున 3గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కడప ట్రాఫిక్ ఎస్ఐ జయరాములు వివరాల మేరకు మృతి చెందిన వ్యక్తి వయసు 35 నుంచి 40 మధ్య ఉంటుందని.. తెల్లవారు జామున రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి.. కేసు నమోదు చేసి నట్లు తెలిపారు. మృతుడి వివరాల కోసం సెల్ 9121100539, 9121100540 నెంబర్లకు ఫోను చేయాలని తెలిపారు.

అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తి రిమ్స్‌కు...

కడప క్రైం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఆర్టీసీ గ్యారేజీ సమీపంలో అపస్మారకస్థితిలో పడిపోయి ఉన్న కోట భక్తవత్సలంనాయుడు అనే వ్యక్తిని ఆర్టీసీ ఏఎస్ఐ శ్రీరాములునాయక్, రిటైర్డ్ ఆర్టీసీ కండక్టరు వెంకటసురేశ్‌బాబులు గుర్తించారు. 108కు సమాచారం అందించడంతో అతన్ని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అయితే అతడికి ఫిట్స్ వచ్చి పడిపోయాడా, లేక అనారోగ్యంతో సొమ్మసిల్లి పడిపోయాడా అనేది తెలియాల్సి ఉంది. అతని వద్ద ఉన్న ఫోను ద్వారా వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

జరిమానాలు చెల్లించని కారు సీజ్

కడప క్రైం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో ఓ కారు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో పలు దఫాలుగా చలానాలు వేశారు. బుధవారం ట్రాఫిక్ ఎస్ఐ జయరాములు సిబ్బందితో వాహన తనిఖీలు చేపట్టగా ఇదే కారు పట్టుబడింది. దీంతో కారుకు సంబంధించి 18 ఈచలానాలు పెండింగులో ఉన్నట్లు గుర్తించి సీజ్ చేశారు. అయితే కారు యజమాని పెండింగు చలానాలకు సంబంధించి రూ.10,515 చెల్లించడంతో కారును అతనికి అప్పగించారు. వాహ నదారులు పెండింగులో ఉన్న ఈ చలానాలను సక్రమంగా చెల్లించకపోతే సీజ్ చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

వివాహిత ఆత్మహత్య



మైలవరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపరాల గ్రామానికి చెందిన కుండా లక్ష్మీదేవి (38) అనే వివాహిత క్షణికావేశంలో బుధవారం ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ శ్యాంసుందర్‌రెడ్డి వివరాల మేరకు... ఇంటిలో చిన్న చిన్న సమస్యల విషయమై కుటుంబ సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో కలత చెందిన లక్ష్మీదేవి ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భర్త శ్రీనివాసులు ఫిర్యాదు మేకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధింపులు.. కేసు నమోదు

పులివెందుల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం తేవాలని తన భర్త, అత్త వేధిస్తున్నారని బుధవారం పులివెందులకు చెందిన ఓ మహిళ (తను పేరును బయటకు వెల్లడించవద్దని పోలీసులకు విన్నవించిన) పులివెందుల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి వివరాల మేరకు.. తాడిపత్రికి చెందిన నవాజ్‌షరీఫ్ అనే వ్యక్తితో తనకు వివాహం చేసి తల్లిదండ్రులు పంపించారన్నారు. కానీ కొంతకాలంగా భర్త నవాజ్ షరీఫ్, అత్త రహమత్‌బీలు వేధిస్తున్నారని... వారి వేధింపులు తాళలేక పుట్టింటికి వచ్చానని పేర్కొన్నారు. ఈమేరకు ఆమె పులివెందుల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చాంద్‌బాష తెలిపారు.

మహిళ అదృశ్యం



కలసపాడు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌బి (30) అదృశ్యమైనట్లు భర్త షేక్ హుస్సేన్‌వలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎల్.తిమోతి తెలిపారు. వివరాల్లోకెళితే... ఈనెల 21వ తేదీ ఇంటివద్ద నుంచి వెళ్లిపోయిందని, ఎక్కడికి వెళ్లిందో అని బంధువులు ఇళ్లలో వెతికి చూడగా కనిపించలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే కలసపాడు పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయాలని తెలిపారు. 9121100632 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

రైతులను మోసగిస్తే క్రిమినల్ కేసులు

● జిల్లాలో ఎరువుల కొరత లేదు
● జేడీఏ చంద్రానాయక్

ప్రొద్దుటూరు రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ ఎరువుల కొరతను సృష్టించి రైతులను ఇబ్బంది పెట్టినా, అధిక ధరలకు అమ్మకాలు జరిపినా క్రిమినల్ కేసులు నమోదు చేసి దుకాణాలు సీజ్ చేస్తామని వ్యవసాయశాఖ జిల్లా సంయుక్త సంచాలకులు బి.చంద్రానాయక్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని మహాలక్ష్మి ఫర్టిలైజర్స్‌లో స్టాకు వివరాలను పరిశీలించి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎరువుల కొరత లేదన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ అవసరాలకు తగ్గట్లు జిల్లాకు 70 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు మంజూరయ్యాయన్నారు. ఇప్పటి వరకు రైతు సేవా కేంద్రాలు, రీటైల్, హోల్‌సేల్ దుకాణాల్లో అన్నింటిలో కలిపి 25 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కొంతమంది కృత్రిమ ఎరువుల కొరతను సృష్టించి రైతుల్లో ఆందోళన కలిగించి అధిక మోతాదుల్లో స్టాకును కొనుగోలు చేసేలా ప్రోత్సహించడం తప్పుదారి పట్టించడమేనని అన్నారు. రైతులు కొనుగోలు చేసిన అన్నింటికి దుకాణ యజమానులు తప్పనిసరిగా బిల్లులు అందజేయాలని ఆదేశించారు. బిల్లులు ఇవ్వకపోయినా, అధిక ధరలకు ఎరువులు అమ్మినా రైతులు నేరుగా ఆ దుకాణాల నుంచే స్థానిక వ్యవసాయాధికారులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేస్తే 15 నిమిషాల్లో అక్కడికి చేరుకుని వారిపై చర్యలు తీసుకునేలా యాక్షన్‌ప్లాన్ చేపడుతున్నామన్నారు. రైతన్నలకు వ్యవసాయ శాఖ అండగా ఉంటుందని, ప్రతి రైతు అవసరాలను రైతు సేవా కేంద్రాల ద్వారా పూర్తి చేస్తామన్నారు. పంట కాలపరిమితి పూర్తయ్యేవరకు ఎరువులు అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు డివిజన్ ఏడీఏ అనిత, కడప డీఆర్‌సీ కేంద్ర ఏడీఏ అశోక్‌రెడ్డి, ఏవో వరాహరికుమార్, తదితరులు పాల్గొన్నారు.



ఎరువుల దుకాణంలో స్టాకును పరిశీలిస్తున్న జేడీఏ చంద్రానాయక్, వ్యవసాయాధికారులు

తొండూరు ఎస్ఐపై జమ్మలమడుగు జడ్జికి ఫిర్యాదు

● రీమెడికల్ ఎగ్జామ్‌కు ఆదేశించిన కోర్టు

పులివెందుల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తొండూరు మండలంలోని ఇనగలూరు హత్యాయత్నం కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిని బుధవారం సాయం త్రం జమ్మలమడుగు కోర్టులో హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించారు. ఈసందర్భంగా తొండూరు ఎస్ఐ తమను కొట్టినట్లు జమ్మలమడుగు కోర్టు జడ్జికి ఐదుగురు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించి వివరాల్లోకెళితే... తొండూరు మండలంలోని ఇనగలూరు గ్రామా నికి చెందిన ఓ వర్గం మరో వర్గంవారిపై కారుతో ఢీకొట్టి కత్తు లతో, రాడ్లతో దాడి చేశారు. ఇందుకు సంబంధించి తొండూరు పోలీస్‌స్టేషన్‌లో 11 మందిపై హత్యాయత్నం కేసు నమోదైంది. ఈ కేసులో ఉన్న ప్రశాంత్ రెడ్డి, ఓబుళ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, గంగిరెడ్డిలను పోలీసులు అరెస్టు చేసి బుధ వారం సాయంత్రం జమ్మలమ డుగు కోర్టులో హాజరు పరిచారు. ఈ సందర్భంగా వారు తొండూరు ఎస్ఐ ఘనమద్దిలేటి తమపై థర్డ్‌డిగ్రీ ప్రయోగిం చారని, విచక్షణరహితంగా కొట్టారని జడ్జికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జడ్జి రీమెడికల్ చెకప్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతి ఎస్ఐని వివరణ కోరగా.. జమ్మల మడుగు మెజిస్ట్రేట్ రీమెడికల్ చెకప్‌కు ఆదే శాలు జారీ చేశార న్నారు. అది ఎపుడు, ఎక్కడ అనేది ఇంకా వివరాలు వెల్లడించ లేదని ఆయన తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ఆప్కో డిస్కౌంట్ కార్డుల పంపిణీ

కడప మారుతీనగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఆప్కో చేనేత వస్త్రాల అమ్మకాలపై జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులకు డిస్కౌంట్ కార్డులు పంపిణీ చేసినట్లు కడప ఆప్కో మండల వాణిజ్య అధికారి బి.గోపాలకృష్ణ తెలిపారు. ఉద్యోగులు కార్డులు ఉపయోగించి ఆప్కో విక్రయశాలలో అన్ని రకాల చేనేత వస్త్రాలపై 30 శాతం డిస్కౌంట్ పొందాలని కోరారు. కడప నగరంలోని ఆప్కో విక్రయశాలతో పాటు పులివెందుల, రాయచోటి, కోడూరు, రాజంపేట తదితర ప్రాంతాలలో గల ఆప్కో చేనేత విక్రయశాలల్లో చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి నేతన్నకు చేయూత అందించాలని కోరారు.

నిరుద్యోగ మహిళలకు ఉచిత శిక్షణ

కడప(వినాయకనగర్), జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లాలోని నిరుద్యోగ మహిళలకు కెనరా బ్యాంకు, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ కడప వారి ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ ఆరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు.
రామాంజనేయపురంలోని గర్ల్స్ ఐటీఐ కాలేజీ పక్కన ఉన్న డీటీసీ కేంద్రంలో టైలరింగ్, బ్యూటీ పార్లర్, ఎంబ్రాయిడరీలో గ్రామీణ మహిళలకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఈ శిక్షణ ఈనెల 28 నుంచి ఆగస్టు 27 వరకు ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9440905478, 9985606866 నెంబర్లను సంప్రదించాలన్నారు.



రామిరెడ్డిపల్లెలో అరుదైన పుట్టగొడుగు

వేంపల్లె, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రామిరెడ్డిపల్లె గ్రామంలో అరుదైన పుట్టగొడుగు లభించింది. బుధవారం రామిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన రైతు బోరెడ్డి నరసింహారెడ్డి పొలంలో ప్రకృతి సిద్ధంగా మొలిచిన పుట్టగొడుగు దాదాపు 1.76 కిలోల బరువు ఉండడంతో పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆ గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు వింతగా చూసేందుకు వచ్చారు.

మల్టీడే మూడు రోజుల క్రికెట్ మ్యాచ్‌లలో చిత్తూరు, కడప జట్ల విజయం

కడప స్పోర్ట్స్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-16 మెన్ మల్టీడే మూడు రోజుల క్రికెట్ మ్యాచ్‌లలో తమ ప్రత్యర్థి జట్లపై చిత్తూరు, కడప జట్లు విజయం సాధించాయి. వివరాలిలా.........

కడప నగర రిమ్స్ సమీప వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో ఈనెల 21వ తేదీ నుంచి అనంతపురం-చిత్తూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 38.2 ఓవర్లలో 128 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. ఇందుకు ప్రతిగా చిత్తూరు జట్టు 50.5 ఓవర్లలో 184 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో చిత్తూరు జట్టుకు 56 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన అనంతపురం జట్టు 66.3 ఓవర్లలో 252 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో 196 పరుగుల విజయలక్ష్యంతో దిగిన చిత్తూరు జట్టు మూడవ రోజైన బుధవారం 74.5 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 197 పరుగులు చేసి విజయం సాధించింది. ఇందులో అక్తర్ 105 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చాడు. దీంతో చిత్తూరు జట్టు 2 వికెట్ల తేడాతో గెలుపొందింది.

కేవోఆర్ఎం క్రికెట్ మైదానంలో నెల్లూరు-కడప జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో తొలుత నెల్లూ రు జట్టు బ్యాటింగ్‌కు దిగి 29.3 ఓవర్లలోనే కేవలం 78 పరుగులకే అన్ని వికెట్లు కోల్పోయిన సంగతి తెలిసిందే. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 38.4 ఓవర్లలో 140 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో కడప జట్టుకు 62 పరుగులు మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన నెల్లూరు జట్టు 69.2 ఓవర్లలో 215 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. దీంతో 153 పరుగుల విజయలక్ష్యంగా బరిలోకి దిగిన కడప జట్టు 66.3 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేసి గెలుపుసాధించింది.



అక్తర్ (చిత్తూరు)

ఆశావర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి



ఆశాల సమస్యలపై చర్చిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ నాగరాజు

కడప కలెక్టరేట్, జూలై 23, (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి శాయశక్తుల కృషి చేస్తానని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర కమిషనరు ఆదేశాల మేరకు డీఎఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కార వేదిక జరిగింది.

ఈ సమావేశంలో 17 మంది ఆశావర్కర్లు తమ సమస్యలను డీఎం అండ్‌హెచ్‌ఓకు విన్నవించగా 12 మంది సమస్యలు పరిష్కరించినట్లు తెలి యజేశారు. ఈసందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ ప్రతి ఆశా కార్యకర్త ఇ-ఆశా యాప్ ప్రతి రోజు ఓపెన్ చేయాలన్నారు. ఐదుగురు ఇండి కేటర్స్‌ను అప్లోడ్ చేయాలన్నారు. కిల్కారి సేవల గురించి ప్రతి గర్భిణికి తెలి యజేసి, వాటిని ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఉమా మహేశ్వరకుమార్, వేణు, ఆశా, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో రైతుకు లాభం, భూమికి ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రాజెక్టు మేనేజర్ వెంకటమోహన్

● ప్రకృతి వ్యవసాయ సాగు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటమోహన్

రాయచోటిటౌన్, జూలై23(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ సాగుతో రైతుకు లాభంతో పాటు భూమికి ఆరోగ్యం కలుగుతుందని ప్రకృతి వ్యవసాయం సాగు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటమోహన్ పేర్కొన్నారు. బుధవారం రాయచోటి మండల పరిధిలోని గొర్లముదివేడు క్లస్టర్‌కు చెందిన యండపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానాలతో వేరుశనగ సాగును ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతు భయ్యారెడ్డి పొలంలో రెండు ఎకరాల్లో ఈ ప్రకృతి పద్ధతిలో వేరుశనగ పంటను సాగు చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు మేనేజర్ మాట్లాడుతూ ప్రతి 9 అడుగులకు కంది, మధ్యలో అలసంద, అనప, గోంగూర, మొటిక వంటి అనుబంధ పంటలు వేరుశారు. రక్షక పంటలుగా జొన్న, జాజ, ఎర్రపతాలు, ఆముదం వేశారు. ఈ పద్ధతులు పాటించడం వలన ప్రధాన పంటను తెగుళ్ల నుండి కాపాడటంతో పాటు భూసారాన్ని పెంపొందిస్తాయన్నారు. ఈ మోడల్‌లో 400 కేజీల ఘనజీవామృతం వినియోగించడం ద్వారా వానపాములు భూమిని గుల్లగా చేసి భూమి లోపల జీవవైవిద్యాన్ని పెంచాయన్నారు. రైతులు ఈ పద్ధతులను అనుసరించడం వల్ల పెట్టుబడి తగ్గి దిగుబడి పెరగడం ద్వారా నికర ఆదాయం మెరుగవుతోందన్నారు. అనంతరం నేచురల్ ఫార్మింగ్ అసిస్టెంట్ రమణనాయక్, మాస్టర్ ట్రైనర్ చిన్నరెడ్డెన్న మాట్లాడుతూ ప్రకృతి పద్ధతుల భూమికి ఆరోగ్యాన్ని అందిస్తూ రైతులకు భరోసా కలిగిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదుపై విచారణ

● ఇంటి నిర్మాణం చేయరాదు ● డీఎల్‌పీవో మస్తాన్‌వలి



స్పందనలో ఫిర్యాదుపై విచారిస్తున్న డీఎల్‌పీవో మస్తాన్‌వలి

సుండుపల్లె, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఇంటి నిర్మాణాన్ని అధికారులు, స్థానికులు అడ్డుకుంటున్నారని సంపూర్ణ అనే మహిళ స్పందనలో ఫిర్యాదు చేసినట్లు డీఎల్‌పీవో మస్తాన్ వలి తెలిపారు. బుధవారం మండలంలోని రాయవరం గ్రామ పంచాయతీ చీనేవాండ్లపల్లెలో ఇంటి నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. గ్రామ కంఠంలో ఇంటి నిర్మాణం చేస్తున్నారని, పంచాయతీ అధికారులు గతంలో వారికి నోటీసులు జారీ చేశారు. ఈ విషయమై స్థానికులతో విచారించామన్నారు. ప్రస్తుతం ఇంటి నిర్మాణం చేస్తున్న సంపూర్ణ కు టుంబీకులకు రెవెన్యూ అధికారులు ఎటువంటి పట్టా (అనుబంధ ఫారం) జారీ చేయలేదని రాతపూర్వకంగా ఇచ్చారనర్నారు. అయితే 2012లో రెవెన్యూ అధికారులు అనుబంధ ఫారం ఇచ్చినట్లు చూపిస్తున్నారన్నారు.వారు చూపిస్తున్న అనుబంధ ఫారము రెవెన్యూ రికార్డుల్లో నమోదు కాలేదనే విషయాన్ని తమ దృష్టికి రెవెన్యూ అధికారులు తీసుకొచ్చారన్నారు. ఈ మేరకు విచారణ చేపట్టామన్నారు. ప్రస్తుతం ఇంటి నిర్మాణం గోడల వరకు పూర్తయినట్లు తెలిపారు. స్థానిక సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

ఓబులవారిపల్లె, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని మంగంపేట లక్ష్మీచెన్నకేశవ ఆలయ పరిధిలో సీఐటీయూ నూతన మండలి సమావేశం నిర్వహించారు. సీఐటీయూ సభ్యురాలు రాధాకుమారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిత్యం కార్మికుల సమస్యలపై పోరాటాలు చేస్తున్నామన్నారు.

'కూటమి ప్రభుత్వం ప్రజల పక్షం'

రాయచోటిటౌన్,జూలై23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజల పక్షమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా అన్నారు. బుధవారం ఆయన రాయచోటి పట్టణంలోని చర్చి వీధిలో సుపరిపాలన తొలి అడుగు, ఇంటింటికి టీడీపీ కార్యక్రమం నిర్వహించారు. రాయచోటి నియోజకవర్గంలో ఏ సమస్య ఉన్నా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకురావాలన్నారు.

మార్కెట్ చైర్మన్‌కు అభినందనలు

లక్కిరెడ్డిపల్లె, జూలై23(ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్ఎండీ డాక్టర్ షఫీనాయక్‌ను ఆర్ఎంపీల డాక్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కేవీఎస్ నాయుడు, గౌరవాధ్యక్షుడు మహల్ రవీంద్ర, ట్రెజరీ దొరబాబు, జాయింట్ సెక్రటరీ శ్రీధర్‌రెడ్డి, వీరశంకర్ బుధవారం అభినందలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్కెట్ యార్డును అభివృద్ధి చేయాలన్నారు.

స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దుదాం



గోపగుడిపల్లెలో పరిశుభ్రతను పరిశీలిస్తున్న సెంట్రల్ టీం సభ్యులు

రామాపురం, జూలై23(ఆంధ్రజ్యోతి): మన ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని మన గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా ఆదర్శ గ్రామంగా ఉంచుకుందామని కేంద్ర శానిటేషన్ టీం సభ్యులు దామోదరం, గోపగుడిపల్లె, సుద్దమళ్ల సర్పంచులు సరోజమ్మ, లక్ష్మీదేవి పేర్కొన్నారు. గోపగుడిపల్లె, సుద్దమళ్ల గ్రామాల్లో బుధవారం స్వచ్ఛ భారత్‌లో భాగంగా స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ 2025లో భాగంగా బుధవారం సెంట్రల్ శానిటేషన్ టీం సభ్యులు గ్రామంలో పర్యవేక్షించారు.

ప్రత్యామ్నాయ పంటల నర్సరీ నిర్వహణకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న హెచ్‌వో సింధూరి

లక్కిరెడ్డిపల్లె, జూలై23(ఆంధ్రజ్యోతి): ప్రత్యామ్నాయ పంటలు నర్సరీ నిర్వహణకు రైతులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఉద్యానశాఖ అధికారి సింధూరి పేర్కొన్నారు. బుధవారం లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాల్లోని వివిధ నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నర్సరీల చట్టంలోని పలు అంశాలను నర్సరీ యజమానులకు వివరించారు. నర్సరీలు ఏర్పాటు చేసిన 6 నెలలోపు రిజిస్ట్రేషన్ చేసుకొని లైసెన్స్ పొందాలన్నారు. లైసెన్స్ పొం దేందుకు నర్సరీ ఉన్న భూమి పాసుబుక్కు జిరాక్స్, వన్‌బీ, అడంగల్ ఉండాలన్నారు. భూమిలేని వారు కౌవులకు భూమి తీసుకొని నర్సరీలు సాగు చేసుకునే వారు మూడు సంవత్సరాలకు లీజ్ తీసుకున్నట్లు అగ్రిమెంట్ చేయించుకోవాలన్నారు. ఆధార్‌కార్డు జిరాక్స్, మూడు పాస్‌పోర్టుల సైజు ఫోటోలు, రాబోవు మూడు సంవత్సరాల కాలంలో నర్సరీలో పెంచే మొక్కల వివరాల అంచనాలు వేయించుకొని నేల, నీటి విశ్లేషణ పరీక్ష నివేదిక, నర్సరీ నమూనా మ్యాప్, చలానా చెల్లించి నర్సరీ పత్రాలతో లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. నాణ్యత గల, అధిక దిగుబడినిచ్చే రకాలను మాత్రమే ఉత్పత్తి చేయాలన్నారు.

నానో యూరియా, డీఏపీలతో పలు ప్రయోజనాలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న డీఏవో నారాయణ

పెనగలూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : నానో యూరియా డీఏపీల వినియోగం వల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతున్నాయని జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ అన్నారు. బుధవారం నారాయణనెల్లూరు, కోమంతరాజపురం, ఓబిలి గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి ఎన్‌కేవీ సుబ్రమణ్యం అధ్యక్షతన రైతులకు నానో ఎరువుల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. రైతులతో గ్రామసభలు జరిగాయి. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ రైతులు అధికంగా రసాయన ఎరువులు వాడటం వల్ల భూములు సారవంతం కోల్పోయి నిస్సారంగా మారిపోతున్నాయని, దానివల్ల పంట దిగుబడి బాగా తగ్గిపోతుందని తెలిపారు. కాబట్టి నానో యూరియా డీఏపీ నానో జింక్ సాగరిక అనే ఉత్పత్తును వాడితే ఖర్చు తగ్గి దిగుబడి బాగా వస్తుందన్నారు.

రాజంపేట మాజీ ఎంపీ రామయ్య విగ్రహానికి నివాళి



మాజీ ఎంపీ రామయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కేకే చౌదరి, నాయకులు

ఓబులవారిపల్లె, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఖాదీ చిన్నపరిశ్రమల శాఖ చైర్మన్ కేకే చౌదరి బుధవారం మంగంపేట వద్ద ఉన్న రాజంపేట పార్లమెంట్ మాజీ సభ్యుడు గునిపాటి రామయ్య ఘాట్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ గునిపాటి రామయ్య కుమారుడు గునిపాటి కిరణ్‌కుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు రూపేష్‌రెడ్డితో కలిసి మంగంపేట చెన్నకేశవస్వామికి పూజలు చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై నోటీసులు జారీ



ఉప్పరపల్లెలో అక్రమ కట్టడాలను పరిశీలిస్తున్న తహసీల్దారు తిరుమల బాబు

సిద్దవటం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డీకేటీ స్థలాల్లో ఎటువంటి పత్రాలు లేకుండా గృహ నిర్మాణాలు చేపడుతున్న వారికి తహసీల్దారు ఆకుల తిరుమల బాబు నోటీసులు జారీ చేశారు. బుధవారం ఆయన ఉప్పరపల్లె, మాధవరం-1, 2, 3 వార్డు గ్రామాల్లో పర్యటించారు. రెవెన్యూ రికార్డుల్లో లేని అనుబంధ పత్రాలను కొంతమంది సృష్టించి నిర్మాణ పనులు చేపడుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో బుధవారం తహసీల్దారు పర్యటించారు. ఈ విషయమై వీఆర్ఏపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్దవటం మండలంలోని ఉప్పరపల్లె, మాధవరం 1, 2, 3 వార్డుల్లో గ్రామాల పరిధిలోని శాఖరాజుపల్లె రెవెన్యూ సర్వేనంబర్లు 420/1, 424/2, 425 ప్రభుత్వ డీకేటీ స్థలంలో కొంతమంది తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి అక్రమంగా గృహ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదు రావడంతో ఆ ప్రాంతంలో పర్యటించారు. ఎవరైనా అనుమతులు లేకుండా గృహ నిర్మాణ పనులు, ప్రభుత్వ డీకేటీ స్థలాలు కబ్జా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్ఐ ప్రసాద్ బాబు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వీధి దీపాలకు మరమ్మతులు



పుల్లంపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : పంచాయతి సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో వీదిదీపాలకు మరమ్మతులు చేపట్టారు. అక్కడక్కడ వెలగని దీపాలను మార్చి వెలుగులు నింపారు. పారిశుద్ధ్య పనుల్లో భాగంగా వీధి దీపాలను మార్చడం జరిగిందని, పారిశుద్ధ్య పనులకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని సర్పంచ్ ఈ సందర్భంగా తెలియజేశారు.

రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

నందలూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాజంపేటను ప్రకటించాలని పోతన సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి శంకర్ సీఎం చంద్రబాబును కోరారు. ఈ మేరకు వినతిపత్రం పంపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజంపేటలో 1905 నుంచి 20 ఎకరాల విస్తీర్ణంలో బ్రిటీష్ పరిపాలన నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం ఉందన్నారు. నందలూరులో 305 ఎకరాల విస్తీర్ణంలో ఆల్విన్ కర్మాగారం ఉండేదని, రాజంపేట పట్టణ నడిబొడ్డున నాలుగు న్యాయస్థానాల ప్రాంగణం, 15 ఎకరాల్లో ఏపీఎస్ఆర్టీసీ డిపో, రహదారుల భవనాల శాఖ విశ్రాంతి గృహం కార్యాలయం, రెవెన్యూ, అటవీశాఖ, అగ్నిమాపక, 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, రెవెన్యూ ఇతర ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయన్నారు.

హమాలీలకు నెల మొదటివారంలోనే జీతాలు చెల్లించాలి

రాజంపేట టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : సివిల్ సప్లై హమాలీలుగా పనిచేస్తున్న వారికి ప్రభుత్వం ప్రతినెలా మొదటివారంలోనే జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి సికిందర్, హమాలీ మేస్త్రి సూరి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ గోడౌన్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో హమాలీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీలకు ప్రతినెలా 20 రోజులు దాటినా జీతం ఇంతవరకు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ప్రతి సంవత్సరం యూనిఫాంకు కుట్టుకూలి ఇవ్వాలన్నారు. సివిల్ సప్లై డీటీలు మూడో తేదీ లోపు బిల్లులు పెట్టాలని, ఆలస్యంగా పెట్టడం వల్లే జీతాలు చెల్లించడంలో ఆలస్యం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

'మా స్థలంలోకి దౌర్జన్యంగా వచ్చి బెదిరిస్తున్నారు'

రాయచోటిటౌన్, జూలై23(ఆంధ్రజ్యోతి): కోర్టు ఇంజక్షన్ ఆర్డర్‌ను సైతం లెక్క చేయకుండా దౌర్జన్యంగా మా స్థలంలోకి వచ్చి బెదిరిస్తున్నారని రాయచోటి మున్సిపల్ వైస్ చైర్మన్ పోలంరెడ్డి దశరథరామిరెడ్డి బుధవారం రాయచోటి అర్బన్ సీఐ వెంకటాచలపతికి ఫిర్యాదు చేసినట్లు బుధవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయచోటి గ్రామ పొలం సర్వే నెంబర్ 553లో పీడీఆర్ ఫంక్షన్ హాల్‌ను నిర్మించుకొని అనుభవించుకుంటున్నానన్నారు. ఈ ఫంక్షన్ హాలుకు దక్షిణవైపున 40 అడుగుల సిమెంటు రోడ్డు వేసుకొని ఉన్నానన్నారు. ఆ స్థలం విషయంలో 2021లో రాయచోటి ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో వ్యాజ్యం దాఖలైందన్నారు. రాయచోటి పట్టణం ఎన్జీవో కాలనీలో నివాసం ఉంటున్న మోడెం ఆదినారాయణరెడ్డి పైన దావా దాఖలు చేసి ఇంజక్షన్ ఆర్డర్‌ను పొందామన్నారు. ఆదినారాయణరెడ్డికి ఎలాంటి హక్కు లేకున్నా అతని భార్య, అల్లుళ్లు, మరికొంత మంది దౌర్జన్యంగా వచ్చి రోడ్డును స్వాధీనం చేసుకుని కూసాలు నాటుతున్నారన్నారు. ప్రశ్నించగా ప్రభుత్వం మాది.. నీకు దిక్కు ఉన్నచోట చెప్పుకోపో అని బెదిరిస్తున్నారన్నారు. ఈ విషయమై రాయచోటి అర్బన్ సీఐకి ఫిర్యాదు చేసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసినట్లు ఆయన వివరించారు.

నాన్న ఆశయ సాధనే లక్ష్యం: సుగవాసి ప్రసాద్‌బాబు



పాలకొండ్రాయుడి సంస్మరణ సభలో మాట్లాడుతున్న ప్రసాద్‌బాబు

రాయచోటిటౌన్/సంబేపల్లె/చిన్నమండెం, జూలై23 (ఆంధ్రజ్యోతి): 'నాన్న ఆశయ సాధనే లక్ష్యమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు అన్నారు. బుధవారం రాయచోటి మండల పరిధిలోని శిబ్యాల గ్రామం బలిజపల్లెలో స్వర్గీయ సుగవాసి పాలకొండ్రాయుడు సంస్మరణ సభను స్థానిక ప్రజలు, నాయకులు ఏర్పాటు చేశారు. ప్రసాద్‌బాబు హాజరై పాలకొండ్రాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కార్యకర్తల కష్టసుఖాల్లో వెన్నంటి ఉంటా

కార్యకర్తల కష్టసుఖాల్లో వెన్నంటి ఉంటానని సుగవాసి ప్రసాద్‌బాబు తెలిపారు. బుధవారం సంబేపల్లె మండలం గురిగింజకుంట గ్రామం దిన్నెపల్లెలో శెట్టిపల్లి క్రిష్టారెడ్డి దశదిన కర్మకాండ కార్యక్రమానికి హాజరయ్యారు.

అమానుల్లా మృతదేహానికి నివాళి

మండలంలోని చాకిబండ కస్బాకు చెందిన టీడీపీ మైనార్టీ సీనియర్ నాయకుడు అమానుల్లా బుధవారం మృతిచెందడంతో సుగవాసి ప్రసాద్‌బాబు మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నూతన వధూవరులకు వస్త్రాలు బహూకరణ

రైల్వేకోడూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసంలో వివాహం చేసుకునే నూతన వధూవరులకు గంగమ్మతల్లి భవన్ ఆధ్వర్యంలో నూతన వస్త్రాలను బహూకరించనున్నట్లు గంగమ్మతల్లి జాతర కమిటీ అధ్యక్షుడు పంద్రా రాంబాబు తెలిపారు. బుధవారం గంగమ్మ భవన్‌లో నూతన వస్త్రాలను సిద్ధంగా ఉంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగమ్మ భవన్‌లో జరిగే ప్రతి వివాహానికి వధూవరులకు నూతన వస్త్రాలను ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి వారంలో గురువారం రోజున దాతల సహకారంతో అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. కమిటీ సభ్యులు ఉంగరాల సభాపతి, శోడిశెట్టి భాస్కర్, చెన్నంశెట్టి బాల, కూటమి నాయకులు పోతురాజు నవీన్, నార్జాల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు తప్పక పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ అధికారి మహబూబ్‌బాషా

సుండుపల్లె, జూలై23(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో యాజమాన్యం పద్ధతులు తప్పక పాటించాలని మండల వ్యవసాయశాఖ అధికారి మహబూబ్‌బాషా తెలిపారు. బుధవారం మండలంలోని జీ. రెడ్డివారిపల్లె గ్రామ పంచాయతీలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వేరుశనగ విత్తనకాయలు విత్తనశుద్ధి చేసిన అనంతరం వెయ్యాలన్నారు. మందులు పిచికారీ చేసేటప్పుడు వ్యవసాయ శాఖ అధికారులు సలమాలు తప్పక పాటించాలని రైతులకు సూచించారు.

బి.కమ్మపల్లెలో పొలం పిలుస్తోంది

ఓబులవారిపల్లె, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బి.కమ్మపల్లె గ్రామ పంచాయతిలో వ్యవసాయ మండల అధికారిని ఏఓ మల్లిక ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ క్షేత్రంలో రైతులతో చర్చించారు. మందుల పిచికారీకి డ్రోన్ 80 శాతం సబ్సిడీతో ఇస్తున్నామని, కావాల్సిన రైతులకు వ్యవసాయాధికారిని సంప్రదించాలని తెలిపారు. డ్రోన్ ద్వారా జీవన ఎరువులు, పురుగు మందులు ద్రవరూపంలో ఉన్న ఎరువులు తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో చేసుకోవచ్చునని తెలిపారు. రైతుసేవా కేంద్రంలో సిబ్బంది రామాంజి, త్రివేణి, మధు, బుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వీరమల్లు సినిమా విడుదల సందర్భంగా ర్యాలీ



రైల్వేకోడూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తదితరులు

రైల్వేకోడూరు, జూలై 23(ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ నటించిన వీరమల్లు సినిమా విజయవంతం కావాలని బుధవారం రైల్వేకోడూరు జనసేన పార్టీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ బలిజవీధిలో ఉన్న గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మంగంపేట నుంచి రైల్వేకోడూరు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. బాణసంచా పేల్చారు. రైల్వేకోడూరు పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ రాజకీయాల్లో కొనసాగుతూ ఆయన ఒప్పందం చేసుకున్న సినిమాల్లో నటిస్తున్నార న్నారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, కూటమి నాయకులు గునిపాటి చెన్నరాయుడు, పగడాల చంద్రశేఖర్, వరికూటి నాగరాజు, ఉత్తరాది శివకుమార్, గుగ్గిళ్ల సుబ్బరాయుడు, మర్రిరెడ్డి ప్రసాద్, ముద్దపోలు రామసుబ్బయ్య, ముద్దపోలు సభాపతి, ముత్యాల కిషోర్, దాసరి వీరేంద్ర, యువకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిజమైన బంగారు కుటుంబాలను గుర్తించి ప్రోత్సహిద్దాం

సంబేపల్లె, జూలై23(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా పీ4 సర్వేలో నిజమైన బంగారు కుటుంబాలను గుర్తించాలని ఎంపీడీవో రామచంద్ర, తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని నారాయణరెడ్డిపల్లె, సంబేపల్లె, దేవపట్ల నాగిరెడ్డిగారిపల్లె పంచాయతీల్లో ఎంపీడీవో రామచంద్ర, మోటకట్ల సచివాలయంలో తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి గ్రామ సభలు నిర్వహించారు. బంగారు కుటుంబాల ఎంపిక జాబితాలో తప్పులు ఉంటే సవరించాలన్నారు.

నందలూరు: నందలూరు గ్రామ పంచాయతీ సచివాలయం-2 పరిధిలో 22 బంగారు కుటుంబాలను గుర్తించినట్లు మండల స్పెషల్ ఆఫీసర్ గుణశేఖర్‌పిళ్లై పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీవో రాధాకృష్ణన్, తహసీల్దారు అమరేశ్వరి ఆధ్వర్యంలో పీ4 సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుణశేఖర్‌పిళ్లై మాట్లాఉతూ 22 బంగారు కుటుంబాలకు మార్గదర్శకులకు ఇద్దరిని ఎంపిక చేశామన్నారు. ఈవోపీఆర్డీ సునీల్‌కుమార్, ఆర్ఐ సుశీల్‌కుమార్, ఏవో మల్లికార్జున, నందలూరు పంచాయతి కార్యదర్శి శ్రీనివాసులు, సీడీపీపీ మెంబరు సుజిత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గాలివీడు: పీ4 అనేది ఒక గొప్ప సేవా కార్యక్రమం అని ఎంపీడీవో చంద్రమౌళీశ్వర్ పేర్కొన్నారు. ఆయన బుధవారం వివిధ సచివాలయాల్లో పీ4 కార్యక్రమంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల్లో ఉన్న సంపన్నులు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు, ఉన్నత విద్యావంతులు, ఎన్నారైలు, ఉద్యోగస్తులు మొదలైన వారు మార్గదర్శకాలుగా మారి బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు ముందుకు రావాలని కోరారు.

చెత్త సంపద కేంద్రం తనిఖీ చేసిన కలెక్టర్



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ శ్రీధర్

రాజంపేటటౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల పరిధిలోని హస్తవరం గ్రామ పంచాయతీలోని చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీలోని పారిశుధ్య కార్మికులు ప్రతిరోజూ ఇంటింటికి వెళ్లి ఎంత చెత్త సేకరిస్తున్నారు. ఆ చెత్తను కేంద్రానికి తీసుకువచ్చి వేరు చేస్తున్నారా లేదా అని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. రాజంపేట మండలంలో హస్తవరం గ్రామ పంచాయతీకి ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా నిర్వహించిన సర్వేలో 40 శాతం మాత్రమే పాజిటివ్ వచ్చిందన్నారు. వెనుకబడి ఉండడానికి గల కారణాలు తెలుసుకుని వాటిని సరిదిద్ది వంద శాతానికి చేరుకోవాలన్నారు. అనంతరం హస్తవరం ఉన్నత పాఠశాలను సందర్శించి అక్కడ నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం ఎలా అమలవుతుంది, ప్రతిరోజూ మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందిస్తున్నారా, రుచికరంగా ఉందా అనే విషయాలపై కలెక్టర్ ఆరా తీశారు. విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం అందించాలని, వంట ఏజెన్సీ వారికి, ఉపాధ్యాయులకు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో వరప్రసాద్, రాజంపేట తహసీల్దారు పీర్‌మున్నీ, పంచాయతీ విస్తరణాధికారి రామ్మూర్తి, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి అభినందనలు

పుల్లంపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): చెత్త సేకరణలో పురోగతి సాధించి వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాన్ని పురోగతిలో పెట్టిన తిప్పాయపల్లె పంచాయతీ కార్యదర్శి గంగాధర్‌ను కలెక్టర్ చామకూరి శ్రీధర్ అభినందించారు. తిప్పాయపల్లె ఎస్‌డబ్ల్యూపీసీ (చెత్త సేకరణ కేంద్రాన్ని) కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెత్త సేకరణ కేంద్రం వినియోగం గ్రీన్ అంబాసిడర్ల నిర్వహణపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రీన్ అంబాసిడర్లతో సమస్యలు తెలుసుకున్నారు. గతంలో కంటే మెరుగైన జీతాలు సకాలంలో అందుతున్నాయని కలెక్టర్‌కు గ్రీన్ అంబాసిడర్లు తెలిపారు. గతనెల 5న తిప్పాయపల్లెలో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రం సందర్శించినప్పటికి, నేటికి ఎంతో మార్పు కనిపించడంతో తక్కువ సమయంలో అతి తక్కువ మంది గ్రీన్ అంబాసిడర్లను వినియోగించుకుని పురోగతి సాధించడంపై పంచాయతి కార్యదర్శి గంగాధర్‌ను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు పుల్లారెడ్డి, ఎంపీడీవో జయశ్రీ, ఈవోపీఆర్డీ ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిలువు దోపిడీ

- కనీస విద్యార్హత లేకుండానే రోగులకు వైద్యం
- ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృత్ తేజ



సమావేశంలో మాట్లాడుతున్న అమృత్ తేజ

పీలేరురూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోగులను నిలువు దోపిడీ చేస్తున్నారని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృత్ తేజ ఆరోపించారు. బుధవారం ఆయన పీలేరులో విలేకరులతో మాట్లాడు తూ మంత్రితో పాటు వైద్యశాఖ అధికారులు ప్రైవేట్ ఆస్పత్రుల ఆగడాలపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. కనీస విద్యార్హత లేని వారిచే రోగులకు వైద్యం చేయిస్తూ ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నామ మాత్రంగా తనిఖీ చేపడుతున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముందస్తుగా ఎటువంటి పరీక్షలు నిర్వహించకుండా ధనార్జనే ధ్యేయంగా ఆపరేషన్లు చేసి రోగుల ప్రాణాలు తీస్తున్నారని ఆరోపించారు. రోజురోజుకూ ప్రైవేట్ ఆస్పత్రుల ఆగడాలు శృతి మించిపోతు న్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యం వికటించి ప్రాణాలు పోతే డబ్బు ఎరచూపి తప్పించుకుంటున్నారని ఆరోపించారు. పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యం అందించేకన్నా వ్యాపార దృక్పథంతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు ప్రైవేట్ మెడికల్ మాఫియాపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో విద్యార్థి సంఘ నేతలు తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

దువ్వూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం క్రీస్తురాజపురం వద్ద టిప్పర్ ఢీకొని గాయపడ్డ మద్దూరు హుస్సేనయ్య (63) అనే వ్యక్తి బుధవారం తెల్లవారుజామున మృతిచెందినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. ప్రమాద సంఘటన ఈ నెల 12న జరిగింది. రాజుపాళెం మండలం వెలువలి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై మైదుకూరు సంతకు మేకపిల్లను తీసుకుని వెళుతుండగా ప్రమాదం జరిగింది. అదే రోజు ఒకరు మృతిచెందారు. గాయపడ్డ హుస్సేనయ్య కడప అటు నుంచి తిరుపతికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.

శ్రీరామ ఎత్తిపోతల పథకానికి..

పూర్వ వైభవం వచ్చేనా ..?

- టీటీడీ స్వాధీనం ఎప్పుడో ?
- రైతుల ఆశలు చిగురించేనా !



నీరులేక ఎండిపోయిన ఒంటిమిట్ట చెరువు

ఒంటిమిట్ట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలోని అతి పెద్ద చెరువుల్లో ఒంటిమిట్ట చెరువు ఒకటి. ఈ చెరువు నిండితే మండలంలోని అన్ని గ్రామాలు సస్యశ్యామలంగా ఉంటాయి. చెరువు నిండాలని మండల రైతులు మొక్కని దేవుడు అంటూ ఉండరు. ఒక్కసారి చెరువు నిండితే మూడు సంవత్సరాలు రైతులు సంతోషంగా పంటలు పండిస్తారు. వర్షం పడితేగాని ఒంటిమిట్ట చెరువుకు నీరు రాదు. వర్షాలు పడక చెరువుకు నీరు రాకపోవడంతో మండల రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. తాగునీరుకు కూడా ప్రజలు అవస్థలు పడేవారు అలాంటిది 2014లో రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రం విడిపోయి భద్రాచలం తెలంగాణలో ఉండిపోవడంతో, ఒంటిమిట్ట కోదండరాముని ఆలయానికి రాష్ట్ర గుర్తింపు ఇచ్చి ఉత్సవాలను ప్రభుత్వం తరపున నిర్వహించాలని సీఎం నిర్ణయించారు. అలాగే ఒంటిమిట్ట చెరువుకు సోమశిల బ్యాక్‌వాటర్ నుంచి సాగునీరు అందించాలని సీఎం రూ.32 కోట్లను విడుదల చేశారు. ఈ పనులకు సంబంధించి 2015లో చంద్రబాబు శంకుస్థాపనలు కూడా చేశారు. సంవత్సరం తిరగకముందే ఒంటిమిట్ట చెరువుకు సోమశిల బ్యాక్ వాటర్ శ్రీరామ ఎత్తిపోతల పథకం నుంచి సాగునీరు చేరాయి. దీంతో మండల ప్రజల ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. 2019 తరువాత ఈ స్కీంకు మెయింటినెన్స్ నిధులు అప్పటి ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో నీరు అందక చెరువు ఎండిపోయింది. గత ప్రభుత్వం ఐదు సంవత్సరాల్లో ఒక్కరూపాయి కూడా నిధులు మంజూరు చేయకపోవడంతో తిరిగి మండలంలో కరవుఛాయలు అలుముకున్నాయి. దీంతో రైతులు పంటలు సాగులేక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

2024లో తిరిగి రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించడంతో మండల రైతులు సంతోషం వ్యక్తం చేశారు. చంద్రబాబునాయుడు పాలనలో ఎత్తిపోతల పథకానికి నిధులు మంజూరు చేసి చెరువుకు సాగునీరు అందిస్తారని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పలుసార్లు శ్రీరామ ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేసి సాగునీరును నింపేందుకు ప్రయత్నించగా పైపులు పగిలిపోవడంతో పలుసార్లు అంతరాయం ఏర్పడింది. దీంతో ఇరిగేషన్ అధికారులు పరిశీలించి పాత పైపులైను పూర్తిగా దెబ్బతిన్నదని, కొత్త పైపులైను వేయాలని ప్రభుత్వానికి రూ.12 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన కోదండరాముని కల్యాణోత్సవానికి సీఎం చంద్రబాబు విచ్చేశారు. కల్యాణం అనంతరం టీటీడీ చైర్మన్ జిల్లా కలెక్టర్, టీటీడీ ఈవో, అదనపు జేఈవోలతో కోదండరామాలయ అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి పలు సూచనలు ఇచ్చారు. అలాగే శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని టీటీడీ స్వాధీనం చేసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. టీటీడీ అధికారులు చెరువు అంతర్గత విస్తీర్ణం ఆయకట్టు ప్లాను, ఎత్తిపోతల పథకం పనితీరు, మోటార్లు, పైపులైను సమాచారాన్ని సేకరించాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు చెరువు అంతర్గత విస్తీర్ణం మాత్రమే సేకరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించి నెలలు గడుస్తున్నా టీటీడీ అధికారులు మాత్రం పట్టించుకున్న పాపాన పోలేదని పలువురు రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా టీటీడీ అధికారులు శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని స్వాధీనం చేసుకుని కొత్త పైపులైను అమర్చి చెరువుకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



సాగునీరు అందించే పైపులైను

చెరువుకు సాగునీరు అందించాలి



జిల్లాలోనే అతిపెద్ద చెరువు అయిన ఒంటిమిట్ట చెరువుకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలి. గత రెండేళ్లుగా వర్షాలు లేకపోవడంతో భూగర్భజలాలు అడుగంటాయి. అధికారులు స్పందించి చెరువుకు సాగునీరు అందించాలి.

- వెంకటసుబ్బారెడ్డి, మండల టీడీపీ రైతు సంఘం అధ్యక్షుడు, ఒంటిమిట

టీటీడీ స్వాధీనం చేసుకోవాలి



టీటీడీ వారు ఒంటిమిట్ట శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని స్వాధీనం చేసుకోవాలి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకొని మరమ్మతు పనులు చేసి చెరువుకు త్వరగా సాగునీరు అందించాలి.

- మాడ రామాంజనేయులు, రైతు, ఒంటిమిట్ట

బాలల హక్కులు, చట్టాలపై అవగాహన పొందాలి

- ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి



బాలల హక్కులు, చట్టాలపై మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి

మదనపల్లెటౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న బాలల హక్కులు, చట్టాలపై ప్రతి ప్రభుత్వ ఉద్యోగి అవగాహన కలిగి వుండాలని ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి పేర్కొన్నారు. బుధవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఎంఈఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఎస్ఐలు, చైల్డ్ వెల్ఫేర్ అధికారులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు వర్క్‌షాప్ నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ నేటి సమాజంలో అనాథ పిల్లలు, దివ్యాంగులైన పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని వారి కుటుంబ పెద్దలు భిక్షాటనలో దింపుతున్నారన్నారు. మరి కొందరు బాలికలను బాల్యవివాహాలు చేసి వారి భవిష్యత్‌ను నాశనం చేస్తున్నారన్నారు. వీటన్నింటినీ నిషేదించేందుకు ప్రభుత్వాలు చట్టాలు తీసుకొచ్చాయన్నారు. అందులో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం, జువైనల్ జస్టిస్ యాక్ట్, పోక్సో చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టం అమలులో వున్నాయన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో చదువుకున్న వారికి ఈ చట్టాలపై అవగాహన వస్తోందని, బాల, బాలికలు ఉన్నత చదువులు చదుకోవడానికి తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. గ్రామస్థాయి కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని అందులో పంచాయతీ కార్యదర్శి అధ్యక్షులుగా వుండాలన్నారు. ప్రతి నెలా మొదటి, మూడో శుక్రవారం సమావేశాలు నిర్వహించి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి వినోద్ కుమార్ మాట్లాడుతూ ఈ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో ప్రతి ప్రభుత్వ ఉద్యోగి బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె, బి.కొత్తకోట, వాల్మీకిపురం, మదనపల్లె, ఐసీడీఎస్ సీడీపీఓలు సుజాత, భాగ్యమ్మ, పోర్డు సంస్థ డైరెక్టర్ లలితమ్మ, సూపర్‌వైజర్లు శ్వేత, రమాదేవి, మహిళా ఎస్ఐలు, ఎంఈవోలు, పాల్గొన్నారు.

షోలాపూర్ - తిరుపతి ప్రత్యేక రైలు ధర్మవరం వరకు పొడిగింపు

కడపఎర్రముక్కపల్లె, జూలై 23 (ఆంధ్రజ్యోతి): షోలాపూర్-తిరుపతిల (01437/01438) మధ్య కడప మీదుగా వెళ్లే ప్రత్యేక రైలును ధర్మవరం వరకు రెండు నెలల పటు పొడిగించినట్లు కడపరైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. ఈనెల 24 నుంచి సెప్టెంబర్ 27వ తేదీ వరకు రాను 10 ట్రిప్పులు, పోను 10 ట్రిప్పులు నడుస్తుందన్నారు. సోలాపూర్ నుంచి తిరుపతి (01437 రైలు) ప్రతి బుధవారం రాత్రి 11:20 గంటలకు సోలాపూర్‌లో రైలు బయలుదేర రాయచూర్, మంత్రాలయం, గుంతకల్ మీదుగా ఎర్రగుంట్లకు శుక్రవారం రాత్రి 7:18 గంటలకు, కడపకు 7:53గంటలకు చేరుకోనుందన్నారు. ధర్మవరానికి శనివారం ఉదయం 3:30గంటలకు చేరుకుంటుందన్నారు. ఈ రైలు తిరుగు ప్రయాణంలో ప్రతి శనివారం ఉదయం 5:30గంటలకు ధర్మవరంలో బయలుదేరి రేణిగుంట మీదుగా తిరుపతికి 11:0గంటలకు, రాజంపేటకు మధ్యాహ్నం 12:28కి, కడపకు 1:28కి, ఎర్రగుంట్లకు 2.09కి చేరుకుంటుందన్నారు. తాడిపత్రి,గుంతకల్ మీదుగా ఆదివారం ఉదయ 10:4కి సోలాపూర్‌కు చేరుకుంటుందన్నారు.

భూమి చదునును అడ్డుకున్న అధికారులు



భూమిని చదును చేస్తుండగా అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

మదనపల్లె అర్బన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): అక్రమంగా భూమిని చదును చేస్తుండగా బుధవారం రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. మదనపల్లె మండలం, కొండామరిపల్లె పంచాయతీలో కొందరు అక్రమంగా ఎక్స్‌కవేట ర్‌తో భూమిని చదును చేస్తున్నట్లు తహసీల్దార్ కార్యాలయానికి సమాచారం అందడంతో తహసీల్దార్ కిరణ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు అక్కడికి రెవెన్యూ సిబ్బంది చేరుకుని అడ్డుకున్నారు. ప్రభుత్వ భూమిని చదును చేయడం నేరమని, ప్రభుత్వ భూమిని అక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సచివాలయ సర్వేయర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

నైపుణ్యాలను వెలికి తీయడమే ఉపాధ్యాయుల కర్తవ్యం

- డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు



ఇంగ్లీష్ క్లబ్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు

రాయచోటిటౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): నైపుణ్యాలను వెలికి తీయడమే ఉపాధ్యాయుల కర్తవ్యమని డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు తెలిపారు. బుధవారం రాయచోటి పట్టణంలోని డైట్‌లో ఇంగ్లీష్ క్లబ్ ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమం విద్యార్థుల భాషా నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు, ఇంగ్లీష్ సాహిత్యం, కమ్యూనికేషన్, సాంస్కృతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసేందుకు ఒక ముఖ్యమైన వేదికగా నిలవనుందని డైట్ ఇంగ్లీష్ లెక్చరర్ తిరుపతి శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు ఇంగ్లీష్ భాషా ప్రాముఖ్యతను వివరించారు. ఇది ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనికేషన్ కోసం అత్యంత అవసరమైన భాష అని పేర్కొంటూ విద్యార్థులు ఈ క్లబ్ ద్వారా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ విద్యావేత్త, సాంస్కృతిక విద్య జిల్లా సమన్వయకర్త కొండూరు శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఇంగ్లీష్ క్లబ్ ద్వారా విద్యార్థులకు డిబేట్లు, చర్చలు, కవితా పఠనలు, ప్రదర్శనలు, వర్క్‌షాపులు వంటి కార్యక్రమాలు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డైట్ లెక్చరర్స్ వెంకటసుబ్బారెడ్డి, శివభాస్కర్, వైసీ రెడ్డెప్పరెడ్డి, మోహన్‌నాయక్, శివప్రసాద్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆవులకు చర్మవ్యాధి నిరోధక టీకాలు

- జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్‌పిళ్లై



ఆవులను పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి

నందలూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతి ఇసుకపల్లె గ్రామంలో ఆవులకు ముద్దచర్మ వ్యాధి నిరోధక టీకాలను వేసినట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జూలై 11 నుంచి 31వ తేది వరకు జరిగే లంపిస్కిన్ (ఆవుల్లో ముద్ద చర్మ)వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆవులకు ముద్ద చర్మ వ్యాధి వచ్చిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాడి రైతులకు వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందలూరు పశువైద్యులు డాక్టర్ పి.ఈశ్వర్‌ప్రసాద్, డాక్టర్ వై.మాధవిలత, వీఏడీ సుదర్శన్‌రెడ్డి, ఏహెచ్ఏలు బి.జాహ్నవి, వై.శిరీషా, బి.శివరాం, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

రాయచోటిటౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని అనారోగ్య బాధితుల ఆసుపత్రి ఖర్చులకు గానూ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. బుధవారం నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి మంత్రి మండిపల్లి క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 20 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.25.30 లక్షల చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.



సీఎం సహాయ నిధి చెక్కులను అందజేస్తున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

మట్టి మాఫియా ఇష్టారాజ్యం

- విఠలం, వడ్డిపల్లె చెరువుల్లో అక్రమ తవ్వకాలు
- బొరియలుగా మారిపోయిన చెరువులు.. అధికారుల చోద్యం

వాల్మీకిపురం, జూలై 23(ఆంధ్రజ్యోతి): రేయింబవళ్లు ఎక్స్‌కవేటర్లతో మట్టిని తోడేస్తూ అక్రమంగా తరలిస్తూ విఠలం, వడ్డిపల్లె చెరువులను ఎక్స్‌కవేటర్లతో తోడేస్తున్నారు. జాతీయ రహదారికి పక్కనే ఉన్న చెరువుల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు సాగుతున్నా అధికారులు పట్టించుకోలేదని విమర్శలున్నాయి. చెరువు నుంచి మట్టిని అక్రమంగా తరలించుకు పోతుండడంతో ఎటుచూసినా అగాధాలు, బొరియలుగా మారి చెరువు ప్రాంతం రూపు రేఖలు కోల్పోతోంది.

వాల్మీకిపురం మండలంలోని విఠలం గ్రామ సమీప చెరువులో మట్టి మాఫియా ఇష్టారాజ్యంగా తవ్వకాలు సాగిస్తున్నారు. కొద్ది నెలలుగా చెరువు ప్రాంతంలో ఎక్స్‌కవేటర్లు పెట్టి మట్టిని అక్రమంగా తవ్వేస్తూ రియల్‌ఎస్టేట్ భూములకు తదితర వాటికి ట్రాక్టర్ల ద్వారా తరలించుకుపోతుండడం గమనార్హం. జాతీయ రహదారికి పక్కగానే ఉన్న చెరువు ప్రాంతంలో మట్టి అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మట్టిని అక్రమంగా తరలించుకుపోతుండడంతో చెరువు రూపురేఖలు కోల్పోతోంది. ఇప్పటికైనా అక్రమ మట్టి తవ్వకాలపై అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. మండలంలోని జర్రావారిపల్లె గ్రామ పంచాయతీ చీమలబండ వడ్డిపల్లె ప్రాంతంలోని చెరువులో మట్టి మాఫియా ఆగడా లకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఎటువంటి అనుమతులు లేకుండా రాత్రీ పగలు ఎక్స్‌కవేటర్లతో మట్టిని తోడేస్తూ రియల్‌ఎస్టేట్ వెంచర్లు తదితర వాటికి అక్రమంగా తరలించుకుపోతున్నారు. ఈ ప్రాంతంలో చెరువులకు నీరు వచ్చే మార్గం లేక 20ఏళ్లుగా గడ్డు పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇసుక మాఫియా దౌర్జన్యాలతో మట్టి అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని, అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ పామిలేటిని వివరణ కోరగా మండలంలోని చెరువు ప్రాంతంలో అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇక ముందు నిఘా పెట్టి అక్రమ తవ్వకాలకు పాల్పడే వాహనాలు సీజ్ చేస్తూ తగు చర్యలు తీసుకుంటామన్నారు.



మట్టి తవ్వకాలతో అగాదాలుగా మారిపోయిన వడ్డిపల్లె చెరువు



విఠలం చెరువులో ఎక్స్‌కవేటర్లతో మట్టితవ్వకాలు



చీమలబండ వడ్డిపల్లె చెరువులో ఎక్స్‌కవేటర్లతో మట్టి తవ్వకాలు

అటకెక్కిన శిక్షణ

- నిరుపయోగంగా మారిన శిక్షణ కేంద్రం
- శిథిలమవుతున్న భవనం
- వృథా అవుతున్న ప్రజాధనం

కడప ఎన్జీఓర్ సర్కిల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రం నిరుపయోగంగా మారుతోంది. కడప నగర శివారు ప్రాంతంలో 2008 నవంబరు 1న అప్పటి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గల్లా అరుణకుమారి క్లస్టరు స్థాయి జీవనోపాధుల వనరుల కేంద్రం ప్రారంభించారు. అప్పటి నుంచి డ్వామా పరిధిలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాలు ఇక్కడే నిర్వహించేవారు. రాత్రిపూట శిక్షణార్థులు బస చేసేందుకు వీలుగా డార్మిటరీలను ఏర్పాటు చేశారు. కానీ గత కొంత కాలంగా ఇక్కడ శిక్షణలను ఇవ్వకపోవడంతో భవనం నిరుపయోగంగా మారుతోంది. చాలా వరకు శిక్షణ కార్యక్రమాలను కొత్త కలెక్టరేట్‌లోని డి.బ్లాక్ లోనే నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో డీఎల్ఆర్‌సీ భవనం పూర్తిగా నిరుపయోగంగా మారింది. దీంతో భవ నంలోని పలు గదుల్లో సామగ్రి శిథిలావస్థకు చేరుకుంటోంది. గదులకు ఏర్పాటు చేసిన తలుపులు పాడైపోయాయి. విద్యుత్ సౌక ర్యం కూడా సరిగా లేకపోవడంతో చీకటి అలుముకుంది. కిటికీలు ధ్వంసమవుతున్నాయి. చిన్నపాటి మరమ్మతులు చేపడితే ఈ భవ నం అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి. కానీ పూర్తిగా వదిలి వేయడంతో భవనం శిథిలమయ్యే పరిస్థితి కనిపిస్తుంది.


ఊడిన తలుపులు


డీఎల్ఆర్‌సీ భవనం


నిరుపయోగంగా ఉన్న శిక్షణ గది

సిబ్బంది హాజరు నామమాత్రం

డీఎల్ఆర్‌సీ భవనంలో ఎలాంటి శిక్షణలు ఇవ్వకపోయినప్పటికీ అక్కడ సిబ్బందికి ఏ పని చేయకున్నా వేతనాలు అందిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కేంద్రంలో నలుగురు ట్యూటర్లతో పాటు ఒక కంప్యూటరు ఆపరేటరు, పగటిపూట అటెండరు, రాత్రివేళల్లో వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేశారు. అయితే వీరిలో పగలు అటెండరు, రాత్రివేళల్లో వాచ్‌మెన్ మాత్రమే కేంద్రంలో విధులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ప్రతినెలా వేలాది రూపాయలు వారికి వేతనాలుగా చెల్లిస్తున్నారు. ఇటీవల డీఎల్ఆర్‌సీ భవనాన్ని ఆంధ్రజ్యోతి సందర్శించగా అక్కడ అటెండరు ఒక్కరే ఉన్నారు. మిగతా సిబ్బంది గురించి ఆరా తీస్తే వారందరూ భోజనానికి వెళ్లినట్లు అటెండరు సమాధానం ఇవ్వడం గమనార్హం. ఈ విషయం డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా తాను పరిశీలించి చర్యలు తీసుకుంటానని సమాధానం ఇచ్చారు.

ఆర్డీఓ టేబుల్‌పైకి యూసీఐఎల్ బాధితుల ఫైల్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పులివెందుల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): యూసీఐఎల్ బాధితుల ఫైలు ఎట్టకే లకు ఆర్డీఓ చిన్నయ్య టేబుల్‌పైకి చేరింది. బుధవారం 'ఎన్నేళ్లీ... ఎదు రుచూపులు' ఆర్డీఓ కార్యాలయంలో ఫైలు మాయం అనే శీర్షికతో ఆంధ్ర జ్యోతిలో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన ఆర్డీఓ చిన్నయ్య కార్యాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. 10.30గంటలకు నేను కార్యా లయానికి వచ్చేసరికి ఫైల్ నా టేబుల్‌పై ఉండాలని కిందిస్థాయి అధికా రులకు చెప్పినట్లు తెలిసింది. దీంతో కార్యాలయాలో పనిచేసే అధికారులు ఉదయం నుంచే ఫైలు వెతకడం ప్రారంభించారు. అన్ని సెక్షన్ల లోను, ర్యాకుల్లో ఫైళ్లన్నీ పరిశీలించగా.. ఫైల్ కంటపడడంతో అధికారులు ఊపిరిపీల్చు కున్నారు. ఆర్డీఓ కార్యాలయానికి వచ్చే సరికి ఆయన టేబుల్ పైకి ఫైల్ చేరింది. దీంతో కార్యాలయానికి వచ్చే ఫైళ్లను జాగ్రత్తగా భద్రపరచాలని ఆర్డీఓ సిబ్బందికి చెప్పినట్లు తెలిసింది. 11గంటల ప్రాంతంలో ఫైల్‌కు సంబంధించిన బాధితులు భాస్కర్, రవిశంకర్‌లు కార్యాలయానికి వెళ్లగా.. అక్కడున్న సిబ్బంది మీఫైల్ కనిపించిందని అది ఆర్డీఓ టేబుల్‌పైన ఉందని సమాచారం ఇచ్చారు. అదే సమయంలో ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లిన ఆంధ్రజ్యోతికి వారు ఫైల్ విషయాన్ని వివరించారు. మా ఫైల్ కనిపిం చకపోయేటప్పటికి 14ఏళ్లుగా ఎదురు చూసిన ఉపయోగం లేకుండా పోయిం దని ఎంతో బాధపడ్డామని వారు వివరించారు. ఆంధ్రజ్యోతి పుణ్యమా అని వారు మా ఫైల్ కనిపించిందని, కృతజ్ఞతలు తెలిపారు. యూసీఐఎల్ స్పం దించి మాకు ఇవ్వాల్సిన ఉద్యోగాన్ని మాకు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

రైలు కిందపడి గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య



కడప క్రైం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా తాడిపత్రి రైల్వే స్టేషను సమీపంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసుల వివరాల మేరకు.. మృతుడి వయసు 22 నుంచి 26 సంవత్సరాల మధ్యలో ఉంటుందని.. మృతుడి జేబులో చెన్నై టు కడప టికెట్ గుర్తించారు. అయితే చెన్నై నుంచి కడపలో దిగలేక తాడిపత్రిలో దిగి ఆత్మహత్య చేసుకున్నాడా అనే విషయంపై అక్కడ రైల్వేపోలీసులు ఆరా తీస్తున్నారు. మృతి చెందిన యువకుడి ఇతర వివరాల కోసం తాడిపత్రి పోలీసులను సంప్రదించాలని తాడిపత్రి రైల్వే కానిస్టేబుల్ వరప్రసాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



కడప క్రైం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రాజంపేట రోడ్డులోని మహిళా పాలిటెక్నిక్ కళాశాల వద్ద బుధవారం తెల్లవారుజామున 3గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కడప ట్రాఫిక్ ఎస్ఐ జయరాములు వివరాల మేరకు మృతి చెందిన వ్యక్తి వయసు 35 నుంచి 40 మధ్య ఉంటుందని.. తెల్లవారు జామున రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి.. కేసు నమోదు చేసి నట్లు తెలిపారు. మృతుడి వివరాల కోసం సెల్ 9121100539, 9121100540 నెంబర్లకు ఫోను చేయాలని తెలిపారు.

అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తి రిమ్స్‌కు...

కడప క్రైం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఆర్టీసీ గ్యారేజీ సమీపంలో అపస్మారకస్థితిలో పడిపోయి ఉన్న కోట భక్తవత్సలంనాయుడు అనే వ్యక్తిని ఆర్టీసీ ఏఎస్ఐ శ్రీరాములునాయక్, రిటైర్డ్ ఆర్టీసీ కండక్టరు వెంకటసురేశ్‌బాబులు గుర్తించారు. 108కు సమాచారం అందించడంతో అతన్ని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అయితే అతడికి ఫిట్స్ వచ్చి పడిపోయాడా, లేక అనారోగ్యంతో సొమ్మసిల్లి పడిపోయాడా అనేది తెలియాల్సి ఉంది. అతని వద్ద ఉన్న ఫోను ద్వారా వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

జరిమానాలు చెల్లించని కారు సీజ్

కడప క్రైం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో ఓ కారు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో పలు దఫాలుగా చలానాలు వేశారు. బుధవారం ట్రాఫిక్ ఎస్ఐ జయరాములు సిబ్బందితో వాహన తనిఖీలు చేపట్టగా ఇదే కారు పట్టుబడింది. దీంతో కారుకు సంబంధించి 18 ఈచలానాలు పెండింగులో ఉన్నట్లు గుర్తించి సీజ్ చేశారు. అయితే కారు యజమాని పెండింగు చలానాలకు సంబంధించి రూ.10,515 చెల్లించడంతో కారును అతనికి అప్పగించారు. వాహ నదారులు పెండింగులో ఉన్న ఈ చలానాలను సక్రమంగా చెల్లించకపోతే సీజ్ చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

వివాహిత ఆత్మహత్య



మైలవరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపరాల గ్రామానికి చెందిన కుండా లక్ష్మీదేవి (38) అనే వివాహిత క్షణికావేశంలో బుధవారం ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ శ్యాంసుందర్‌రెడ్డి వివరాల మేరకు... ఇంటిలో చిన్న చిన్న సమస్యల విషయమై కుటుంబ సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో కలత చెందిన లక్ష్మీదేవి ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భర్త శ్రీనివాసులు ఫిర్యాదు మేకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధింపులు.. కేసు నమోదు

పులివెందుల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం తేవాలని తన భర్త, అత్త వేధిస్తున్నారని బుధవారం పులివెందులకు చెందిన ఓ మహిళ (తను పేరును బయటకు వెల్లడించవద్దని పోలీసులకు విన్నవించిన) పులివెందుల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి వివరాల మేరకు.. తాడిపత్రికి చెందిన నవాజ్‌షరీఫ్ అనే వ్యక్తితో తనకు వివాహం చేసి తల్లిదండ్రులు పంపించారన్నారు. కానీ కొంతకాలంగా భర్త నవాజ్ షరీఫ్, అత్త రహమత్‌బీలు వేధిస్తున్నారని... వారి వేధింపులు తాళలేక పుట్టింటికి వచ్చానని పేర్కొన్నారు. ఈమేరకు ఆమె పులివెందుల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చాంద్‌బాషా తెలిపారు.

మహిళ అదృశ్యం



కలసపాడు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌బి (30) అదృశ్యమైనట్లు భర్త షేక్ హుస్సేన్‌వలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎల్.తిమోతి తెలిపారు. వివరాల్లోకెళితే... ఈనెల 21వ తేదీ ఇంటివద్ద నుంచి వెళ్లిపోయిందని, ఎక్కడికి వెళ్లిందో అని బంధువులు ఇళ్లలో వెతికి చూడగా కనిపించలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే కలసపాడు పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయాలని తెలిపారు. 9121100632 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

రైతులను మోసగిస్తే క్రిమినల్ కేసులు

- జిల్లాలో ఎరువుల కొరత లేదు
- జేడీఏ చంద్రానాయక్


ఎరువుల దుకాణంలో స్టాకును పరిశీలిస్తున్న జేడీఏ చంద్రానాయక్, వ్యవసాయాధికారులు

ప్రొద్దుటూరు రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ ఎరువుల కొరతను సృష్టించి రైతులను ఇబ్బంది పెట్టినా, అధిక ధరలకు అమ్మకాలు జరిపినా క్రిమినల్ కేసులు నమోదు చేసి దుకాణాలు సీజ్ చేస్తామని వ్యవసాయశాఖ జిల్లా సంయుక్త సంచాలకులు బి.చంద్రానాయక్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని మహాలక్ష్మి ఫర్టిలైజర్స్‌లో స్టాకు వివరాలను పరిశీలించి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎరువుల కొరత లేదన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ అవసరాలకు తగ్గట్లు జిల్లాకు 70 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు మంజూరయ్యాయన్నారు. ఇప్పటి వరకు రైతు సేవా కేంద్రాలు, రీటైల్, హోల్‌సేల్ దుకాణాల్లో అన్నింటిలో కలిపి 25 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కొంతమంది కృత్రిమ ఎరువుల కొరతను సృష్టించి రైతుల్లో ఆందోళన కలిగించి అధిక మోతాదుల్లో స్టాకును కొనుగోలు చేసేలా ప్రోత్సహించడం తప్పుదారి పట్టించడమేనని అన్నారు. రైతులు కొనుగోలు చేసిన అన్నింటికి దుకాణ యజమానులు తప్పనిసరిగా బిల్లులు అందజేయాలని ఆదేశించారు. బిల్లులు ఇవ్వకపోయినా, అధిక ధరలకు ఎరువులు అమ్మినా రైతులు నేరుగా ఆ దుకాణాల నుంచే స్థానిక వ్యవసాయాధికారులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేస్తే 15 నిమిషాల్లో అక్కడికి చేరుకుని వారిపై చర్యలు తీసుకునేలా యాక్షన్‌ప్లాన్ చేపడుతున్నామన్నారు. రైతన్నలకు వ్యవసాయ శాఖ అండగా ఉంటుందని, ప్రతి రైతు అవసరాలను రైతు సేవా కేంద్రాల ద్వారా పూర్తి చేస్తామన్నారు. పంట కాలపరిమితి పూర్తయ్యేవరకు ఎరువులు అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు డివిజన్ ఏడీఏ అనిత, కడప డీఆర్‌సీ కేంద్ర ఏడీఏ అశోక్‌రెడ్డి, ఏవో వరాహరికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి


ఆశాల సమస్యలపై చర్చిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో నాగరాజు

కడప కలెక్టరేట్, జూలై 23, (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆశావర్కర్ల సమస్యల పరిష్కారానికి శాయశక్తుల కృషి చేస్తానని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర కమిషనరు ఆదేశాల మేరకు డీఎఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కార వేదిక జరిగింది. ఈ సమావేశంలో 17 మంది ఆశావర్కర్లు తమ సమస్యలను డీఎం అండ్‌హెచ్‌ఓకు విన్నవించగా 12 మంది సమస్యలు పరిష్కరించినట్లు తెలియజేశారు. ఈసందర్భంగా డీఎంఅండ్ హెచ్‌వో మాట్లాడుతూ ప్రతి ఆశా కార్యకర్త ఇ-ఆశా యాప్ ప్రతి రోజు ఓపెన్ చేయాలన్నారు. ఐదుగురు ఇండి కేటర్స్‌ను అప్లోడ్ చేయాలన్నారు. కిల్కారి సేవల గురించి ప్రతి గర్భిణికి తెలి యజేసి, వాటిని ఉపయోగిం చుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఉమా మహేశ్వరకుమార్, వేణు, ఆశా, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ పాల్గొన్నారు.

తొండూరు ఎస్ఐపై జమ్మలమడుగు జడ్జికి ఫిర్యాదు

- రీమెడికల్ ఎగ్జామ్‌కు ఆదేశించిన కోర్టు

పులివెందుల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తొండూరు మండలంలోని ఇనగలూరు హత్యాయత్నం కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిని బుధవారం సాయం త్రం జమ్మలమడుగు కోర్టులో హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించారు. ఈసందర్భంగా తొండూరు ఎస్ఐ తమను కొట్టినట్లు జమ్మలమడుగు కోర్టు జడ్జికి ఐదుగురు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించి వివరాల్లోకెళితే... తొండూరు మండలంలోని ఇనగలూరు గ్రామా నికి చెందిన ఓ వర్గం మరో వర్గంవారిపై కారుతో ఢీకొట్టి కత్తు లతో, రాడ్లతో దాడి చేశారు. ఇందుకు సంబంధించి తొండూరు పోలీస్‌స్టేషన్‌లో 11 మందిపై హత్యాయత్నం కేసు నమోదైంది. ఈ కేసులో ఉన్న ప్రశాంత్ రెడ్డి, ఓబుళ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, గంగిరెడ్డిలను పోలీసులు అరెస్టు చేసి బుధ వారం సాయంత్రం జమ్మలమ డుగు కోర్టులో హాజరు పరిచారు. ఈ సందర్భంగా వారు తొండూరు ఎస్ఐ ఘనమద్దిలేటి తమపై థర్డ్‌డిగ్రీ ప్రయోగిం చారని, విచక్షణరహితంగా కొట్టారని జడ్జికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జడ్జి రీమెడికల్ చెకప్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతి ఎస్ఐని వివరణ కోరగా.. జమ్మల మడుగు మెజిస్ట్రేట్ రీమెడికల్ చెకప్‌కు ఆదే శాలు జారీ చేశార న్నారు. అది ఎపుడు, ఎక్కడ అనేది ఇంకా వివరాలు వెల్లడించ లేదని ఆయన తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ఆప్కో డిస్కౌంట్ కార్డుల పంపిణీ

కడప మారుతీనగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఆప్కో చేనేత వస్త్రాల అమ్మకాలపై జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులకు డిస్కౌంట్ కార్డులు పంపిణీ చేసినట్లు కడప ఆప్కో మండల వాణిజ్య అధికారి బి.గోపాలకృష్ణ తెలిపారు. ఉద్యోగులు కార్డులు ఉపయోగించి ఆప్కో విక్రయశాలలో అన్ని రకాల చేనేత వస్త్రాలపై 30 శాతం డిస్కౌంట్ పొందాలని కోరారు. కడప నగరంలోని ఆప్కో విక్రయశాలతో పాటు పులివెందుల, రాయచోటి, కోడూరు, రాజంపేట తదితర ప్రాంతాలలో గల ఆప్కో చేనేత విక్రయశాలల్లో చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి నేతన్నకు చేయూత అందించాలని కోరారు.

నిరుద్యోగ మహిళలకు ఉచిత శిక్షణ

కడప(వినాయకనగర్), జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లాలోని నిరుద్యోగ మహిళలకు కెనరా బ్యాంకు, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ కడప వారి ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ ఆరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు.
రామాంజనేయపురంలోని గర్ల్స్ ఐటీఐ కాలేజీ పక్కన ఉన్న డీటీసీ కేంద్రంలో టైలరింగ్, బ్యూటీ పార్లర్, ఎంబ్రాయిడరీలో గ్రామీణ మహిళలకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఈ శిక్షణ ఈనెల 28 నుంచి ఆగస్టు 27 వరకు ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9440905478, 9985606866 నెంబర్లను సంప్రదించాలన్నారు.

రామిరెడ్డిపల్లెలో అరుదైన పుట్టగొడుగు



వేంపల్లె, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రామిరెడ్డిపల్లె గ్రామంలో అరుదైన పుట్టగొడుగు లభించింది. బుధవారం రామిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన రైతు బోరెడ్డి నరసింహారెడ్డి పొలంలో ప్రకృతి సిద్ధంగా మొలిచిన పుట్టగొడుగు దాదాపు 1.76 కిలోల బరువు ఉండడంతో పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆ గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు వింతగా చూసేందుకు వచ్చారు.

మల్టీడే మూడు రోజుల క్రికెట్ మ్యాచ్‌లలో చిత్తూరు, కడప జట్ల విజయం


అక్తర్ (చిత్తూరు)

కడప స్పోర్ట్స్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-16 మెన్ మల్టీడే మూడు రోజుల క్రికెట్ మ్యాచ్‌లలో తమ ప్రత్యర్థి జట్లపై చిత్తూరు, కడప జట్లు విజయం సాధించాయి. వివరాలిలా.........

కడప నగర రిమ్స్ సమీప వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో ఈనెల 21వ తేదీ నుంచి అనంతపురం-చిత్తూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 38.2 ఓవర్లలో 128 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. ఇందుకు ప్రతిగా చిత్తూరు జట్టు 50.5 ఓవర్లలో 184 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో చిత్తూరు జట్టుకు 56 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన అనంతపురం జట్టు 66.3 ఓవర్లలో 252 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో 196 పరుగుల విజయలక్ష్యంతో దిగిన చిత్తూరు జట్టు మూడవ రోజైన బుధవారం 74.5 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 197 పరుగులు చేసి విజయం సాధించింది. ఇందులో అక్తర్ 105 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చాడు. దీంతో చిత్తూరు జట్టు 2 వికెట్ల తేడాతో గెలుపొందింది.

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో నెల్లూరు-కడప జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో తొలుత నెల్లూ రు జట్టు బ్యాటింగ్‌కు దిగి 29.3 ఓవర్లలోనే కేవలం 78 పరుగులకే అన్ని వికెట్లు కోల్పోయిన సంగతి తెలిసిందే. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 38.4 ఓవర్లలో 140 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో కడప జట్టుకు 62 పరుగులు మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన నెల్లూరు జట్టు 69.2 ఓవర్లలో 215 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. దీంతో 153 పరుగుల విజయలక్ష్యంగా బరిలోకి దిగిన కడప జట్టు 66.3 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేసి గెలుపుసాధించింది.

ఇరవై రోజుల్లో నెరవేరిన 'సుపరిపాలన' హామీ


ఏఎస్ఆర్ కాలనీలో పూర్తయిన కాల్వలు

కలికిరి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఇరవై రోజుల కిందట పట్టణంలో ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి నిర్వహించిన సుపరిపాలన-తొలి అడుగు హామీ సత్వరం నెరవేరడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 2న అమరనాథ రెడ్డి కాలనీలో ఎమ్మెల్యే అధికారులు, నేతలతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరుతెన్నుల గురించి ప్రజలను వాకబు చేశారు. కాలనీలోని సమస్యల గురించి స్థానికులు వివరించారు. ప్రధానంగా డ్రైనేజీ నిర్మాణాలు ఏళ్ల తరబడి జరగలేదని, దీంతో ఇళ్ల నుంచి మురుగు నీరు వెళ్లడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సమస్య వున్న వీధులను ఎమ్మెల్యే పరిశీలించి వెంటనే కాల్వల నిర్మాణం చేపట్టి పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శి అశోక్, అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రెడ్డివారి యోగేష్ రెడ్డిని ఆదేశించారు. ఈ మేరకు కాల్వల నిర్మాణానికి పంచాయతీ చర్యలు తీసుకుంది. ఏఎస్ఆర్ కాలనీ, బండకాడపల్లె దళితవాడల్లో మురుగు నీటి కాల్వల నిర్మాణాలు చేపట్టి బుధవారానికి పూర్తి చేశారు. డ్రైనేజీ, మంచినీటి పైపు లైన్‌లకు రూ.4 లక్షలు ఖర్చు చేసి పూర్తి చేసినట్లు కార్యదర్శి అశోక్, అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు యోగేష్ రెడ్డి చెప్పారు. కేవలం ఇరవై రోజుల్లోనే సమస్య సమస్యను పరిష్కరించడంపట్ల కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

ఫుట్‌పాత్‌పై ఆక్రమణలు తొలగించండి

● దుకాణదారులకు నోటీసులు జారీ


ఆక్రమణలు తొలగించాలని నోటీసులు జారీ చేస్తున్న అధికారులు

ములకలచెరువు, జూలై 23(ఆంధ్రజ్యోతి): ములకలచెరువులో ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసుకున్న ఆక్రమణలు తొలగించాలని అధికారులు బుధవారం నుంచి నోటీసులు జారీ చేస్తున్నారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పాదచారులు రాకపోకలు సాగించడానికి ముంబై - జాతీయ రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్ ఏర్పాటు చేశారు. ఈ ఫుట్‌పాత్‌ను ఆక్రమించుకుని దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. ఫుట్‌పాత్‌పై వెళ్లే వీలులేక పాదచారులు జాతీయ రహదారిపై రాకపోకలు సాగిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో ఎంపీడీఓ హరినారాయణ, తహసీల్దార్ ప్రదీప్, ఎస్‌ఐ నరసింహుడు, పంచాయతీ కార్యదర్శి రామ్లానాయక్ దుకాణదారులకు నోటీసులు జారీ చేశారు. నోటీసు అందుకున్న వారం రోజుల్లోగా ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. నిబంధనల మేరకు అక్రమంగా ఏర్పాటు చేసుకున్న దుకాణాలు తొలగించకుంటే తగు చర్యలు తీసుకుని తామే తొలగిస్తామని హెచ్చరించారు.

కార్మికులను విధుల నుంచి తొలగిస్తే ఊరుకోం

ఇన్‌చార్జి ఈఓకు సూచించిన యూనియన్ నేతలు


ఇన్‌చార్జి ఈఓ లతీఫ్‌ఖాన్‌తో వాదిస్తున్న యూనియన్ నేతలు

పీలేరు రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): చాలీచాలని జీతాలతో బతుకుతున్న పంచాయతీ కార్మికులను విధుల నుంచి తొలగిస్తే ఊరుకోమని పంచాయతీ ఇన్‌చార్జి ఈఓ లతీఫ్ ఖాన్‌తో కార్మికులు వాదించారు. బుధవారం రాత్రి పంచాయతీ కార్యాలయం వద్ద ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రామయ్య ఈఓతో మాట్లాడుతూ ఎవరో చెప్పారని ఇష్టాను సారం ఉన్న కార్మికులను విధుల నుంచి తొలగిస్తే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఎవరైనా విధులకు హాజరు కాకపోతే ప్రొసీజర్ ప్రకారం చర్యలు తీసుకోవాలే తప్ప ఇష్టానుసారం విధుల నుంచి తొలగించే అవకాశం లేదన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధానం ఇప్పుడెందుకు వస్తోందని ఈఓను ప్రశ్నించారు. ఉన్నంతలో కార్మికులకు మేలు చేయాలని కోరారు. మేము చేస్తున్న కష్టం మాకు ఇస్తున్న జీతం ఎంతో అందరికీ తెలుసని, ఇంతలో మళ్లీ బెదిరింపులు, తీసివేయడాలు వద్దని కోరారు. పంచాయతీ యూనియన్ నేతలు ఓబులేసు, రమణ, చిట్టెమ్మ, నాగార్జున పాల్గొన్నారు.

బంగారు కుటుంబాల అవసరాలు గుర్తింపు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ హరినారాయణ

ములకలచెరువు, జూలై 23(ఆంధ్రజ్యోతి): 'పీ4' కార్యక్రమంలో భాగంగా బంగారు కుటుంబాల అవసరాలు గుర్తించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ హరినారాయణ, తహసీల్దార్ ప్రదీప్ అన్నారు. పెద్దపాళ్యం, పాత ములకలచెరువు గ్రామాల్లో బుధవారం 'పీ4'పై గ్రామసభలు నిర్వహించారు. అర్హతగల బంగారు కుటుంబాల గుర్తింపును పారదర్శకంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ గ్రామసభల్లో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'పీ4' ఉన్నతమైన ఆశయం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శివశంకర్

పీలేరు రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): 'పీ4' బంగారు కుటుంబాలను త్వరగా గుర్తించాలని పీలేరు ఎంపీడీఓ శివశంకర్ తెలిపారు. పీలేరు మండలం రేగళ్లు సచివాలయంలో 'పీ4' బంగారు కుటుంబాల గుర్తింపుపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతమైన ఆశయంతో 'పీ4' కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. అత్యంత పేదవారిని గుర్తించి వారి పురోభివృద్ధికి దత్తత తీసుకుంటారని చెప్పారు. ఆర్థికంగా బలమైన అభివృద్ధి చెందిన సంపన్న కుటుంబాలచే బంగారు కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుని వారి జీవన ప్రమాణాలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా 'పీ4' బంగారు కుటంబాల ఎంపిక ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణ, పంచాయతీ కార్యదర్శి గుణశేఖర్, సచివాలయ సిబ్బంది శివప్రసాద్‌రాజు, యశ్వంత్, అర్చన, రమాదేవి, మహ్మదాలి పాల్గొన్నారు.

టమోటా సాగులో బిజీ బిజీ

ఏటేటా పెరుగుతున్న పంట వ్యయం ● నష్టాలు భరిస్తూ.... కష్టాన్ని నమ్ముకుని

దశాబ్దాలుగా ప్రకృతి చిన్న చూపు ● ఆశంతా ప్రకృతి కరుణపైనే ●

కలకడ, జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం టమోట ధరలు ఆశాజనకంగా వున్నాయి. దీంతో ఈ ఏడాది టమోటా పంట సాగుకు రైతులు బిజీ బిజీగా సిద్ధమవుతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పడమటి మండలాలైన కలకడ, గుర్రంకొండ, వాల్మీకిపురం, కేవీపల్లె తదితర మండలాల రైతులు ఈ సీజన్‌లో టమోట పంట సాగు చేస్తారు. పీలేరు ఉద్యానవన పరిధిలోని మూడు మండలాల్లో గత ఖరీఫ్‌లో అధికారుల గణాంకాల ప్రకారం దాదాపు 2 వేల ఎకరాల్లో పంట సాగు చేశారు. కాగా ఒక్క కలకడ మండలంలోనే ఎక్కువగా 1545 ఎకరాల్లో సాగు చేయడం గమనార్హం. ఇక్కడి రైతులు పెట్టుబడి విషయంలో వెనుకాడకుండా గతేడాది కూడా ఎకరాకు రూ.2.5 లక్షల వరకు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. ఈ ప్రాంత రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ ఇతర ప్రాంతాల వారికి ఆదర్శంగా నిలుస్తున్నారు. అయితే దశాబ్ధులుగా ప్రకృతి చిన్న చూపు చూస్తుండడంతో నష్టాల పాలవుతున్నా భరిస్తూ కష్టాన్ని నమ్ముకుని.. దేవుడిపై భారం వేసి ముందుకు సాగుతున్నారు. ఐదేళ్ల కిందట ప్రపంచాన్ని కుదిపేసిన కరోనా మహమ్మారి ప్రభావం రైతులను దెబ్బతీసింది. ఆ సమయంలో సరుకు అమ్ముడుపోయే ప్రధాన నగరాల్లో మార్కెట్లు మూతపడ్డాయి. రవాణా సౌకర్యం పూర్తిగా స్తంభించడంతో పంటను అమ్ముకోలేక తోటల్లోనే వదిలేసిన సంఘటనలు అనేకం. సాధారణంగా అక్టోబరు నుంచి డిసెంబరు వరకు తుపాను ప్రభావంతో ఎడాతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు రైతులను దెబ్బతీస్తున్నాయి. దీనికి తోడు గతేడాది ధరలు పాతాళానికి పడిపోవడంతో కళ్లెదుటే పంటను పశువులకు మేతగా వదిలేశారు. దీంతో మానసికంగా, ఆర్థికంగా రైతులు కుంగిపోయారు. ఖరీఫ్‌లో పంట మొదలుపెట్టడం ఆనవాయితీ. కానీ వరుణుడు దోబూచులాడడంతో సాగు ఆలస్యమైంది. దీంతో జూలైలో పంట సాగు ముమ్మరంగా ఉంది. యధావిధిగా ప్రకృతి కరుణపై ఆశతో రైతు సాగుకు సమాయత్తం అవుతున్నారు.

ఏటా పెరుగుతున్న వ్యయం

గతేడాది టమోటా సాగుకు ఎకరాకు సరాసరి రూ. 2.5 లక్షలు ఖర్చు చేసినట్లు రైతన్నలు తెలిపారు. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం అన్ని ధరలు పెరిగినట్లు పేర్కొన్నారు. దుక్కి దశ మొదలు నారు నాటేవరకు వివిధ ఖర్చులు రూ. లక్ష వరకు పెట్టుబడి అయిందన్నారు. ఈ లెక్కన కాయ, పూత దశనాటికి ఖర్చు మరింత పెరిగి రూ.2.5 లక్షలకు పైగా అవుతుందన్నారు. కొంతమేర బ్యాంక్ రుణాలు అందుతున్నా పాత అప్పుల జమలకే సరిపోతోంది. దీంతో చేతిలో నగదు లేక అప్పు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. విత్తనాల నారు నుంచి ఎరువులు, క్రిమిసంహారక మందుల వరకు బయటి దుకాణాలపై ఆధారపడాల్సి వస్తోంది. రైతుల సౌకర్యాలను ప్రభుత్వం గుర్తించి ఆదుకుంటే కొంతైనా ఉపశమనం కలుగుతుంది.


కలకడ మండలంలో రైతులు సాగు చేసిన టమోటా పంట

నాలుగెకరాల్లో టమోటా సాగు...

ఈ ఖరీఫ్ సీజన్‌లో నాలుగు ఎకరాల్లో టమోటాను సాగు చేస్తున్నా. ఇప్పటి దాకా దుక్కి, సేంద్రియ, రసాయన ఎరువులు, నారు తదితర పెట్టుబడుల ఖర్చులు రూ.4 లక్షలు అయింది. ఇంకా కాయ, పూత దశ నాటికి రెండింతలు ఖర్చు వస్తుంది. ఈ వ్యయాన్ని భరించాలంటే అప్పు చేయక తప్పదు. ప్రభుత్వం కల్పించుకుని టమోటా సాగు చేసే రైతులకు ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి ఆదుకోవాల్సిన అవసరం ఉంది. అప్పటికైనా మాపై కాస్త భారం తగ్గి ప్రాణం కుదుట పడుతుంది.

సోమినేని శ్రీనివాసులునాయుడు,
బాటవారిపల్లె, కలకడ మండలం

ధైర్యం చాలడం లేదు

నిన్నటి ఏడాది రెండు లక్షలకు పైగా ఖర్చు చేసి ఎకరా పొలంలో టమోటాను సాగు చేశా. ధరల పతనంతో కూలీ పైకం కూడా గిట్టుబాటు కాక కాపును కోయకుండా పొలంలోనే వదిలేశా. అలాంటి సమయంలోనూ ఎలాంటి నష్టపరిహారం, బీమా అందలేదు. ఈ ఏడాది సొంత భూమిని కొంత దుక్కి చేశా. కొత్తగా పంట పెట్టుబడి పెట్టాలన్న ధైర్యం చాలడం లేదు. ఒక వేళ పంటను సాగు చేదామన్న భయంగా ఉంది. విపత్కర పరిస్థితులను ప్రభుత్వం, అధికార యంత్రాంగం గుర్తించి ఆదుకోవాలని మనవి.

క్రిష్ణయ్య, ఎర్రకోటపల్లి,
కలకడ మండలం

బీమా పరిహారంలో అన్యాయం

పంటల బీమాపై కలకడ మండలంలో టమోటాకు వాతావరణ అధారిత బీమా వర్తిస్తుందని అధికారులు తెలిపారు. అయితే 2022-23లో బీమా కంపెనీలు ఎకరాకు కేవలం రూ. ఐదు వందలలోపే పరిహారం కొందరికే బ్యాంక్ ఖాతాలో జమ చేశారని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి పంట నష్టపోతే ఈ సాయం ఎందుకు అక్కరకు వస్తుందని బెంగపడుతున్నారు.

ప్రత్యామ్నాయంపై అవగాహన కల్పించాలి

భారీ పంట వ్యయంతో కూడిన టమోట సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. విధి వక్రీకరిస్తే తలకిందులయ్యే పరిస్థితి ఎదురవుతుంది. రైతులు అధికారులు తమ సూచనలు, సలహాలు అందించి టమోటాలో అంతరపంటల సాగు ఇతర లాభదాయకమైన పంటల సాగుపై అవగాహన కల్పిస్తే నష్టాల నుంచి రైతన్న బయటపడి ఉపశమనం కలుగుతుంది.

'సమాచార హక్కు'పై అవగాహన అవసరం




ములకలచెరువు సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ స్రవంతి - తంబళ్లపల్లెలో చట్టంపై అవగాహన కల్పిస్తున్న ఏఓ రమణకుమార్

ములకలచెరువు, జూలై 23(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏఓ స్రవంతి అన్నారు. బురకాయలకోట రైతు సేవా కేంద్రంలో బుధవారం అవగాహన కల్పిస్తూ సెక్షన్లు వివరించారు. సెక్షన్ 6,7(1) కింద దరఖాస్తు చేసుకున్న వారికి 30 రోజుల్లో సమాచారాన్ని పూర్తి స్థాయిలో ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల ఎదుట తప్పనిసరిగా పౌర సమాచార అధికారి, సహాయ అధికారి పేర్లు, ఫోన్ నెంబర్లు రాసి సమాచార హక్కు చట్టం బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సదస్సులో రైతు సేవా కేంద్రాల వ్యవసాయ, ఉద్యానవన సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎద్దులవారిపల్లె ఆర్‌బీకేలో...

తంబళ్లపల్లె, జూలై 23(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏఓ రమణ కుమార్ అన్నారు. ఎద్దులవారిపల్లె రైతు సేవా కేంద్రంలో చట్టంపై అవగాహన నిర్వహించారు. చట్టం 2005 విధి విధానాలను వివరించారు. ప్రజలు, రైతులు ఏ శాఖలోనైనా తమకు కావాల్సిన సమాచారాన్ని సంబంధిత పౌర సమాచార అధికారికి దరఖాస్తు చేసుకుని పొందవచ్చన్నారు.

అద్దవారిపల్లెలో....

కలికిరి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన ఏ సమాచారమైనా కోరిన వెంటనే అందజేసేందుకు సిద్ధంగా వున్నట్లు ఏఓ ఎం.హేమలత హామీ ఇచ్చారు. అద్దవారిపల్లె పంచాయతీలో రైతులతో ఆమె మాట్లాడుతూ సమాచారం కోసం దరఖాస్తు చేసుకున్న అనంతరం నిర్దిష్ట కాలపరిమితిలోగా కోరిన సమాచారాన్ని అందజేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారుల కుందన్నారు. సమాచార హక్కు చట్టం ఉపయోగించుకునే విధానాల గురించి రైతులకు వివరించారు. ప్రతి కార్యాలయంలోనూ సమాచారం ఇచ్చేందుకు బాధ్య అధికారి వివరాలు స్పష్టంగా బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఎంపీఓ హేమలత, అద్దవారిపల్లె, గుండ్లూరు రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జులు ఎం.నగేష్‌నాయక్, ప్రమీల, రైతులు పాల్గొన్నారు.

వాల్మీకిపురం ఆస్పత్రి తనిఖీ


వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ రమేష్‌బాబు

వాల్మీకిపురం, జూలై 23(ఆంధ్రజ్యోతి): జిల్లా అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ రమేష్‌బాబు బుధవారం వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రిలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. టీబీ ముక్త్‌భారత్ అభియాన్ 100రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన తనిఖీలో ఆస్పత్రిలో ల్యాబ్‌లు, రికార్డులు పరిశీలించి వివరాలు ఆరా తీశారు. కార్యక్రమంలో డాక్టర్లు సోము, శివాణి, నీలిమ, హిమబిందు, టీబీ సూపర్‌వైజర్ నాగిరెడ్డి, కౌన్సిలర్ లోకేష్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మెనూ ప్రకారమే భోజనం అందించాలి

నిమ్మనపల్లి, జూలై 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారమే భోజనం అందించాలని తహసీల్దార్ తపస్విని ఎంపీడీఓ రమేష్ పేర్కొన్నారు. రెడ్డివారిపల్లిలోని మోడల్ స్కూల్‌ను తనిఖీ చేశారు. స్టాకు రిజిస్టరు, హాజరును పరిశీలించి తరగతి గదులను పరిశీలించారు. అనంతరం హాస్టల్ విద్యార్థినులతో సమావేశమై హాస్టల్ వసతులు, భోజనం, స్నాక్స్‌పై ఆరాతీశారు. మోడల్ స్కూల్‌కు ప్రహరీ కేటాయించి హాస్టల్‌లో అదనపు గదులు ఏర్పాటుకు సహకరించాలని ఉపాధ్యాయులు కోరారు.

డబ్బు వసూలు చేస్తే చర్యలే

సూపరింటెండెంట్ కోటేశ్వరి

మదనపల్లె అర్బన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆస్పత్రిలో సదరన్ క్యాంపుల్లో సదరన్ సర్టిఫికెట్ కోసం డబ్బు వసూలు చేస్తే చర్యలు తప్పవని సూపరింటెండెంట్ కోటేశ్వరి అన్నారు. వెంకటేశ్ అమ్మ సదరన్ సర్టిఫికెట్ కోసం అమర అనే సిస్టర్ అన్‌లైన్ కోసమని రూ.500 తీసుకున్నా సర్టిఫికెట్ రిజక్ట్ చేశారని ఆరోపిస్తూ సూపరింటెండెంట్‌కు ఆయన ఫిర్యాదు చేశారు.

దౌర్జన్యంగా ఆక్రమిస్తున్నారు

మదనపల్లె అర్బన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): బీకేపల్లెలోని సర్వేనెంబరు 552-3లో తట్టి శామలమ్మ పేరుపై ఉన్న భూమిని ఆక్రమించేందుకు చూస్తున్నాడని ఆమె కుమారుడు మోహన్‌రెడ్డి ఆరోపించారు. భూమిని ట్రాక్టర్‌తో దున్నుతుండగా మేజారి మురళి కొంతమందితో వచ్చి అడ్డుకున్నాడు. మాపై దౌర్జన్యం చేయడంతో 100కు ఫోన్ చేయగా పోలీసులు వచ్చి ఇద్దరినీ రికార్డులు తీసుకుని పోలీసు స్టేషన్ రమ్మన్నారన్నారు.

సారా స్వాధీనం - ఒకరి అరెస్ట్

పీలేరు రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఐదు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్ట్ చేసినట్లు కేవీపల్లె ఎస్ఐ వి.చిన్నరెడ్డెప్ప తెలిపారు. గురకంపల్లె వద్ద వీ. హరి అక్రమంగా నాటు సారా విక్రయిస్తూ పట్టుపడినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

'ఆత్మగౌరవంపై దాడి'

మదనపల్లె, జూలై 23(ఆంధ్రజ్యోతి): బుద్ధుడికొండపై బుద్ధ విగ్రహాల చుట్టూ రెవెన్యూ అధికారులు కంచె వేయడం తమ ఆత్మగౌరవంపై దాడి చేసినట్టని ఆలిండియా భిక్కు సంఘం ఏపీ, తెలంగాణ సమన్వయకర్త భంతే సద్దారక్షిత ఆవేదన వ్యక్తం చేశారు. సొసైటీకాలనీలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన పరిణామాలపై ఆగస్టు 9న చలో మదనపల్లెలో బౌద్ధ సంఘాలు, దళిత వామపక్ష, ప్రగతిశీల సంఘాలను ఏకం చేస్తూ ఆందోళనలు చేస్తామన్నారు. ప్రభుత్వం దిగి వచ్చే దాకా తగ్గమన్నారు.

అభివృద్ధి పథంలో రాష్ట్ర ప్రభుత్వం


ఇంటివద్దే మంజూరు పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాష

నిమ్మనపల్లి, జూలై 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని ప్రభుత్వం అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్ బాష అన్నారు. బుధవారం పిట్టావాండ్లపల్లిలో టీడీపీ ప్రభుత్వం ఏడాది పాలనలో చేపట్టిన సుపరిపాలన తొలిఅడుగులో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రజలకు ఇచ్చిన హామీలను సగానికి పైగా నెరవేర్చామన్నారు. అన్నా క్యాంటీన్‌లు, మెగా డీఎస్సీ, పింఛన్ల పెంపు, తల్లికి వందనం, రైతులకు గోశాలలు, రాష్ట్రంలోని రోడ్లను బాగు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదే అన్నారు. మండలంలో ఇప్పటికే అన్ని గ్రామాల్లో నూ సీసీ రోడ్లు, తాగునీటి బోర్లు వేసినట్లు తెలిపారు. ఉపాధి ద్వారా దాదాపు 150 ఎకరాల్లో ఉద్యాన పంటలు, మరిన్ని సీసీ రోడ్లుకు అనుమతులు వచ్చాయని తెలిపారు. త్వరలోనే రైతు భరోసా నిధులు కూడా రైతుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. అనారోగ్య బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులకు పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు వెంకటరమణ, నేతలు సుజాత, రాజ, శంకర, ఆర్వేవెంకటేష్, మునిరత్నం, రాజన్న, రఫి, రెడ్డెప్ప, చినబాబు, గోపి, సూర్య ప్రకాష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి బాబుతోనే...

ములకలచెరువు, జూలై 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు అన్నారు. దేవళ చెరువులో సుపరిపాలన - తొలి అడుగులో ఆయన మాట్లాడారు. నేతలు శివారెడ్డి, బేరి శ్రీపివాసులు, చంద్రశేఖర్, శ్రీనివాసులు, రామదాసు, కృష్ణప్ప, శంకర, రామాంజులు, నాగరాజు, వెంకటమల్లు, తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'జల్‌జీవన్ మిషన్' ద్వారా పీలేరుకు తాగునీరు

● ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే నల్లారి కిశోర్


ప్రజా దర్బార్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

వాల్మీకిపురం, జూలై 23(ఆంధ్రజ్యోతి): 'జల్‌జీవన్ మిషన్' ద్వారా గండికోట రిజర్వాయర్ నుంచి సీఎం నారా చంద్రబాబునాయుడు సహకారంతో నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో తాగునీటికి శాశ్వత పరిష్కారం చూపబోతున్నట్లు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. వాల్మీకిపురం వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయంలో బుధవారం మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, నేతలు కార్యకర్తలతో నిర్వహించిన ప్రజా దర్బార్‌కు హాజరైన వివిధ గ్రామాల ప్రజల సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే అధికారులతో చర్చించి పరిష్కరించాలని సూచించారు. రూ.2వే లకోట్ల నిధులతో గండికోట రిజర్వాయర్ నుంచి పీలేరు-తంబళ్లపల్లె నియోజకవర్గాలకు పైప్‌లైన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. గుర్రంకొండ కేంద్రంగా రైతుల నుంచి పదెకరాల భూమి సేకరించి పంపింగ్ నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అక్కడి నుంచి ఆరు మండలాలకు నీటి సరఫరా చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నప్పటి నుంచీ సూపర్ సిక్స్ పథకాల అమలుకు పెద్దపీట వేశామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా అవసరం మేరకు అధికారులు ప్రతిపాదించిన ప్రతి ప్రాంతంలో అభివృద్ధి పనులకు అనుమతులు మంజూరు చేశామన్నారు.

కలికిరికి మించి ప్రాధాన్యం....

ఎమ్మెల్యే నల్లారి వాల్మీకిపురం మండల నేతలు, కార్యకర్తలతో మాట్లాడుతూ తనను ఎంతగానో ఆదరించి అభిమానించిన వాల్మీకిపురానికి కలికిరి కంటే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. మండల వ్యాప్తంగా ఇప్పటికే రూ.5కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తదితర సమస్యలన్నీ పరిష్కరించామని, మున్ముందు ప్రతి అభివృద్ధి, ప్రజల సంక్షేమం ఈ మండల నుంచే ప్రాధాన్యంగా ముందుకెళ్తానన్నారు. 15ఏళ్లుగా పట్టణంలోని ఎల్ఆర్ వీధివాసులకు డ్రైనేజీ పెద్ద సమస్యగా మారిందని త్వరలోనే ఆ సమస్యను పరిష్కరించనున్నట్లు తెలిపారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, టీడీపీ సీనియర్ నేత కంభం నిరంజన్ రెడ్డి, చైర్మన్ కోసూరి చంద్రమౌళి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, నేతలు కృష్ణారెడ్డి, రాజేంద్రాచారి, పీవీ నారాయణ, వివిధ శాఖల అధికారులు, నేతలు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.